ఆరు నెలల్లోపు పిల్లల ఆహారంలో వీటిని కలుపొద్దు

వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

భారతీయులకు ట్రంప్ మరో షాక్

Published From : Rangareddy VOLUME : 01 Issue : 301 Sunday, 18-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

పాక్‌లో భూకంపం..

- పాకిస్తాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం
- భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రభావం
- సిమ్లా సమీపంలో 4.1 తీవ్రతతో ప్రకంపనలు
- తెల్లవారుజామున కొన్ని సెకన్ల పాటు కదిలిన భూమి
- రాంపూర్ ప్రాంతంలో భూకంప కేంద్రం గుర్తింపు
- భూమికి 10 కిలోమీటర్ల లోతులో కేంద్రం
- ప్రాణ, ఆస్తి నష్టం లేదని అధికారుల వెల్లడి
- మూడేళ్లలో హిమాచల్‌లో 67 భూకంపాలు

వర్షార్పణమైన ఆఖరి టీ20..

- చిన్నస్వామి స్టేడియంలో వరుణుడి ఆటంకం
- తొలుత 9 ఓవర్లకు కుదింపు.. ఆపై మ్యాచ్ రద్దు
- భారత్ స్కోరు 7.4 ఓవర్లలో 118/5
- ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్.. 10 బంతుల్లో 30 పరుగులు
- సంజూ శాంసన్ 7 బంతుల్లో 16 పరుగులు
- శ్రేయస్ అయ్యర్ వేగంగా 22 పరుగులు
- నమన్ ధీర్ విధ్వంసం.. 6 బంతుల్లోనే 24 పరుగులు
- ఐదో టీ20 రద్దుతో 2--2తో ముగిసిన సిరీస్

బస్టాండ్లు కిటకిట!

- సొంతూళ్లకు పయనమైన ప్రజలతో జేబీఎస్, ఎంజీబీఎస్ కిక్కిరిసిన వైనం
- గంటల తరబడి నిరీక్షణ.. టికెట్ల కోసం ప్రయాణికుల అవస్థలు
- పండుగ రద్దీకి 7 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ
- ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ నుంచి అదనపు సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం
- ప్రైవేట్ ట్రావెల్స్ టికెట్ ధరలు భారీగా పెంచుతున్నాయని ఆరోపణలు
- విజయవాడకు రూ.1,400--1,700 వరకు ఏసీ స్లీపర్ ఛార్జీలు
- రద్దీ దృష్ట్యా ముందస్తు బుకింగ్ చేసుకోవాలని అధికారుల సూచన

హైదరాబాద్,

దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 20న పండుగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగరవాసులు పల్లెబాట పట్టడంతో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్), మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) రద్దీగా మారాయి. టికెట్ కౌంటర్లు, ప్లాట్‌ఫామ్‌లు, వెయిటింగ్ హాళ్లలో ప్రయాణికుల సందడి కనిపిస్తోంది. కొన్ని మార్గాల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)

-మిగతా 2 లో

ఇంటర్నెట్ వినియోగం పిల్లల

ప్రాథమిక హక్కు

పిల్లలను పూర్తిగా దూరం చేయడం సరికాదు

- హానికర కంటెంట్‌ను అడ్డుకోవాల్సిన బాధ్యత వేదికలదే
- నిషేధంతో సమస్య పరిష్కారం కాదన్న సుప్రీంకోర్టు
- మారుమూల పిల్లలకు చదువుకు ఇంటర్నెట్టే ఆధారం
- హానికర సమాచారాన్ని తొలగించేందుకు జాతీయ డేటాబేస్
- పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు అవసరం
- ఇంటర్నెట్ హక్కుపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

పిల్లల భద్రత పేరుతో ఇంటర్నెట్‌కు వారిని పూర్తిగా దూరం చేయడం సరైన పరిష్కారం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పెద్దలతోపాటు పిల్లలకూ ఇంటర్నెట్‌ను వినియోగించే ప్రాథమిక హక్కు ఉందని పేర్కొంది. హానికర కంటెంట్ ఉందనే కారణంతో ఆన్‌లైన్ ప్రపంచానికి వారిని దూరం చేయడం కంటే, అలాంటి సమాచారాన్ని గుర్తించి తొలగించే వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు చదువు, సమాచారం పొందేందుకు ఇంటర్నెట్ ప్రధాన ఆధారంగా ఉంటోందని గుర్తుచేసింది. సామాజిక మాధ్యమాలు సహా వివిధ ఆన్‌లైన్ వేదికల్లో పిల్లలకు హాని కలిగించే కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు సమగ్ర జాతీయ డేటాబేస్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ధర్మాసనం ప్రస్తావించింది.

డైనమిక్ బ్యూరో

ఇంటర్నెట్‌ను ఉపయోగించడం పెద్దలతో పాటు పిల్లలకూ ప్రాథమిక హక్కేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 21, 19(1)(ఎ) అధికరణాల ప్రకారం ఈ హక్కు పిల్లలకూ వర్తిస్తుందని పేర్కొంది. పిల్లల భద్రత కోసం వారిని పూర్తిగా ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచడం సరైన మార్గం కాదని అభిప్రాయపడింది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ కె.వి.నోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్‌లో పిల్లలకు హాని కలిగించే సమాచారం ఉంటున్న మాట వాస్తవమేనని కోర్టు పేర్కొంది. అయితే, అలాంటి సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో

-మిగతా 2 లో

అమెరికా ఒత్తిడికి తలొగ్గం!

- అణ్వాయుధాలు తయారు చేస్తున్నామన్న ప్రచారం పచ్చి అబద్ధం
- అమెరికా బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న అధ్యక్షుడు పెజెష్కియాన్
- అణ్వాయుధాల అభివృద్ధిని గతంలోనే వ్యతిరేకించిన ఖమేనీ
- చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని ఇరాన్ ప్రకటన
- అమెరికా ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధమని విమర్శ
- అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అన్యాయమన్న ఇరాన్ అధ్యక్షుడు
- అర్మేనియా, జార్జియా నేతలతో సమావేశాల్లో ఇరాన్ వైఖరి వెల్లడి
- బలప్రయోగం మాని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు

సీఈసీని తొలగించాలి.. బ్యాలెట్ పద్ధతిని తేవాలి!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు డీఎంకే తీర్మానం
- ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను రద్దు చేయాలని నిర్ణయం
- స్టాలిన్ అధ్యక్షతన పార్టీ ఎంపీల సమావేశం
- ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై రాష్ట్రపతికి వినతిపత్రం
- ఎన్నికల నిర్వహణలో సీఈసీ విఫలమయ్యారని డీఎంకే ఆరోపణ
- కాంగ్రెస్, టీవీకే ద్వంద్వ వైఖరిపై విమర్శలు

కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, ఎన్నికల ప్రక్రియపై తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకే అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరుతూ పార్టీ పార్లమెంటరీ సమావేశంలో నాలుగు తీర్మానాలను ఆమోదించింది. ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించింది. ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థి సంఘాల నిరసనలకు మద్దతు తెలపడంతోపాటు, కాంగ్రెస్, టీవీకే పార్టీల వైఖరిని కూడా డీఎంకే ప్రశ్నించింది.

సీఎం రేవంత్ సద్దుల బతుకమ్మ పండగ శుభాకాంక్షలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ
- ఆడబిడ్డల ఆరాధనకు నిలువెత్తు నిదర్శనం
- పకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతి మనది
- ఆటపాటలతో ఘనంగా సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని పిలుపు
- ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్ష
- మహిళల ఐక్యతను చాటిచెప్పే పండుగగా బతుకమ్మ
- ఆడబిడ్డల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:

సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని, ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి ఈ పండుగ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు, ఆడబిడ్డలు ఆటపాటలతో

-మిగతా 2 లో

సినీ గమ్యస్థానంగా

హైదరాబాద్

భారతీయ సినిమాకు హైదరాబాద్ ప్రధాన కేంద్రం కావాలి!



- యువ దర్శకులు సమాజాన్ని ఆలోచింపజేసే చిత్రాలు తీయాలి
- బతుకమ్మ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక
- వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంపై లఘుచిత్రాలు రూపొందించాలి
- యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది
- మూడు నిమిషాల్లో కథ చెప్పడం గొప్ప సృజనాత్మకత
- షార్ట్‌ఫిల్మ్ ఛాలెంజ్‌లో 29 విభాగాల్లో అవార్డులు
- బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్--2026లో భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 17

యువ దర్శకులు తమ సృజనాత్మకతతో సమాజాన్ని ఆలోచింపజేసే లఘుచిత్రాలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌ను కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా, భారతీయ సినిమాకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్--2026 కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

కాంగ్రెస్ తెచ్చింది:

- రేవంత్ సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు
- దేవాదులలో పది మోటార్లకు మూడే ఎందుకు నడుపుతున్నారు?
- ఎల్‌నినో ముప్పు తెలిసినా నీటి ఎత్తిపోతల్లో నిర్లక్ష్యమని ఆరోపణ
- రిజర్వాయర్లు, చెరువులు నింపడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- సమ్మక్క బ్యారేజీతో 300 రోజుల పాటు నీటిని ఎత్తే అవకాశం
- ఏపీతో పోలిస్తే తెలంగాణలో వర్షపాతం ఎక్కువైనా కరువెందుకని ప్రశ్న
- పట్టిసీమతో ఏపీలో పంటలకు నీరందుతోందని వ్యాఖ్య
- రైతుల కష్టాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

హైదరాబాద్:

తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. రైతులు, ప్రజల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటిని డబ్బుతో కొనలేమని ముఖ్యమంత్రే చెబుతున్నప్పుడు, అంతటి కీలకమైన నీటి నిర్వహణపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ప్రకృతి తెచ్చిన

-మిగతా 2 లో

విద్యార్థుల ఆందోళనతో

అట్టుడికిన ఫ్రాన్స్

వార్తసంధ్య
www.vaarthasandhya.com

పాక్‌లో భూకంపం..

-పాకిస్తాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం
-భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రభావం
-సిమ్లా సమీపంలో 4.1 తీవ్రతతో ప్రకంపనలు
-తెల్లవారుజామున కొన్ని సెకన్ల పాటు కదిలిన భూమి
-రాంపూర్ ప్రాంతంలో భూకంప కేంద్రం గుర్తింపు
-భూమికి 10 కిలోమీటర్ల లోతులో కేంద్రం
-ప్రాణ, ఆస్తి నష్టం లేదని అధికారుల వెల్లడి
-మూడేళ్లలో హిమాచల్‌లో 67 భూకంపాలు

న్యూఢిల్లీ



పాకిస్తాన్‌లో 5.8 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు సమాచారం. దీని ప్రభావంతో భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోనూ ప్రకంపనలు నమోదైనట్లు కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతానికి ఈ ఘటన వల్ల ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదు.
మరోవైపు, శనివారం తెల్లవారుజామున హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా సమీపంలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైంది. రాష్ట్ర రాజధాని సిమ్లాకు సుమారు 130 కిలోమీటర్ల దూరంలోని రాంపూర్ ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం వివరాల ప్రకారం.. ఉదయం 4.36 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. భూకంప కేంద్రం భూమికి 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది. కొండ ప్రాంతమైన హిమాచల్‌లో తరచూ భూకంపాలు సంభవిస్తుండటంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఆగస్టు 26న కూడా సిమ్లాలో స్వల్ప ప్రకంపనలు నమోదయ్యాయి. అధికారిక సమాచారం ప్రకారం.. గత మూడేళ్లలో హిమాచల్‌ప్రదేశ్‌లో 67 భూకంపాలు సంభవించాయి. వీటి కారణంగా సుమారు రూ.7.05 లక్షల మేర ప్రైవేటు ఆస్తులకు నష్టం వాటిల్లినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

వర్షార్పణమైన ఆఖరి టీ20..

-చిన్నస్వామి స్టేడియంలో వరుణుడి ఆటంకం
-తొలుత 9 ఓవర్లకు కుదింపు.. ఆపై మ్యాచ్ రద్దు
-భారత్ స్కోరు 7.4 ఓవర్లలో 118/5
-ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్.. 10 బంతుల్లో 30 పరుగులు
-సంజూ శాంసన్ 7 బంతుల్లో 16 పరుగులు
-శ్రేయస్ అయ్యర్ వేగంగా 22 పరుగులు
-నమన్ ధీర్ విధ్వంసం.. 6 బంతుల్లోనే 24 పరుగులు
-ఐదో టీ20 రద్దుతో 2--2తో ముగిసిన సిరీస్

బెంగళూరు:

భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన ఐదో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. తొలుత వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 9 ఓవర్లకు కుదించినప్పటికీ, భారత ఇన్నింగ్స్ కొనసాగుతున్న సమయంలో మరోసారి వాన పడింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2--2తో సమమైంది. షెడ్యూల్ ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఆలస్యమైంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌తో భారత వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల తర్వాత భారత తుది జట్టులోకి తిరిగి వచ్చినట్లు సమాచారం. తక్కువ ఓవర్ల మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఓపెనర్ అభిషేక్ శర్మ 4 బంతుల్లో 6 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 పరుగులు సాధించాడు. సంజూ శాంసన్ 7 బంతుల్లో 16 పరుగులు చేయగా, శ్రేయస్ అయ్యర్ 14 బంతుల్లో 22 పరుగులు చేశాడు. నమన్ ధీర్ కూడా మెరుపు బ్యాటింగ్‌తో అలరించాడు. తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అతడు, ఆ తర్వాతా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి 6 బంతుల్లో 3 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అప్పటికి భారత్ 7.4 ఓవర్లలో 5 వికెట్లకు 118 పరుగులు చేసింది. అయితే వాన తగ్గకపోవడంతో మ్యాచ్ కొనసాగించే అవకాశం లేకపోయింది. ఫలితం తేలకుండానే ఆఖరి టీ20 ముగియడంతో ఇరు జట్లు సిరీస్‌ను సమంగా పంచుకున్నాయి.

బస్టాండ్లు కిటకిట!

మొదటి తరువాయి

సుమారు 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ప్రధాన బస్టాండ్లతోపాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొన్ని మార్గాల్లో టికెట్ల కొరత, బస్సుల కోసం నిరీక్షణ తప్పడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు.
మరోవైపు పండుగ రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో విజయవాడకు ఏసీ స్లీపర్ టికెట్ ధర రూ.600 నుంచి రూ.700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,700 వరకు అడుగుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు సాధారణంగా రూ.200 ఉండే ఛార్జీ ప్రస్తుతం రూ.400 దాటిందని చెబుతున్నారు. విశాఖపట్నం, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ మార్గాల్లోనూ ధరలు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు.
నగరంలోని మియాపూర్ నుంచి బాలానగర్ వై జంక్షన్ వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదివారం, సోమవారాల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశముండటంతో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. పండుగ సెలవులు ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణాల్లోనూ రద్దీ పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రయాణికులు వీలైనంత ముందుగా టికెట్లు బుక్ చేసుకోవాలని, ప్రైవేట్ ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గం!

-అణ్వాయుధాలు తయారు చేస్తున్నామన్న ప్రచారం పచ్చి అబద్ధం
-అమెరికా బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న అధ్యక్షుడు పెజెష్కియాన్
-అణ్వాయుధాల అభివృద్ధిని గతంలోనే వ్యతిరేకించిన ఖమేనీ
-చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని ఇరాన్ ప్రకటన
-అమెరికా ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధమని విమర్శ
-అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అన్యాయమన్న ఇరాన్ అధ్యక్షుడు
-అర్మేనియా, జార్జియా నేతలతో సమావేశాల్లో ఇరాన్ వైఖరి వెల్లడి
-బలప్రయోగం మాని చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు

యెరెవాన్

తాము అణ్వాయుధాలను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమని తేల్చిచెప్పారు. అణ్వాయుధాల అంశంపై ఇరాన్ వైఖరిలో మార్పు లేదని పేర్కొన్నారు. జీవవైవిధ్య సదస్సు సందర్భంగా అర్మేనియా రాజధాని యెరెవాన్‌లో జార్జియా ప్రధాని ఇరాక్లీ కొబాఖిడ్జేతో జరిగిన సమావేశంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాల అభివృద్ధిని నిషేధిస్తూ ఇరాన్ మాజీ సుప్రీం నేత అలీ ఖమేనీ గతంలో స్పష్టమైన వైఖరి తీసుకున్నారని గుర్తుచేశారు. తమ దేశం చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, అయితే బలవంతపు చర్యలకు అంగీకరించబోమని చెప్పారు. అమెరికా విధిస్తున్న ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని పెజెష్కియాన్ విమర్శించారు. ఇరాన్‌పై ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడులను అన్యాయమైన, అమానవీయ చర్యలుగా అభివర్ణించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని తాము వ్యతిరేకిస్తామని జార్జియా ప్రధాని కొబాఖిడ్జే ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో జరిగిన మరో సమావేశంలోనూ పెజెష్కియాన్ అమెరికా విధానాలపై విమర్శలు చేశారు. ఇరాన్ లొంగిపోదనే వాస్తవాన్ని వాషింగ్టన్ గుర్తించాలని అన్నారు. అమెరికా ఆంక్షలు ఇరాన్‌తోపాటు ఇతర దేశాలకూ సమస్యలు సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని కొనసాగిస్తే ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బలప్రయోగానికి బదులుగా తర్కబద్ధమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికాకు పిలుపునిచ్చారు.

సీఎం రేవంత్ సద్దుల బతుకమ్మ
పండగ శుభాకాంక్షలు

మొదటి తరువాయి

సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల వాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాల పాటు కొనసాగాలని అభిలషించారు.
బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పడంతో పాటు మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అనేక సామాజిక అంశాలతో ముడిపడిన ఈ పండుగను రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు వైభవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సినీ గమ్యస్థానంగా హైదరాబాద్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని పేర్కొన్నారు. వివిధ రంగులు, సువాసనలతో కూడిన పూలు ఒకచోట చేరినట్లుగా, సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చే పండుగ బతుకమ్మ అని వివరించారు. ఇది సామాజిక న్యాయం, సమానత్వం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణలో ప్రతిభావంతులైన యువ దర్శకులు, నటులు, నిర్మాతలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. యువతలోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో రాణించే కళాకారులు మరింత మంది వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రముఖ సినీ గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. మూడు గంటల సినిమాలో చెప్పగలిగే కథను రెండు, మూడు నిమిషాల లఘుచిత్రంలో చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్నదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తమ ఆలోచనలను సమర్థంగా వ్యక్తపరిచే యువ దర్శకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అవార్డులు రానంత మాత్రాన నిరాశ చెందవద్దని, సృజనాత్మకతను కొనసాగిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లఘుచిత్రాలు, పాటలు, జానపద గీతాలు, స్ఫూర్తిదాయక కథలు, వ్యాసాలు తదితర విభాగాల్లో మొత్తం 29 అవార్డులతో యువ ప్రతిభను గుర్తించడం అభినందనీయమని పేర్కొన్నారు.
సినిమా కేవలం వినోదానికే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే సందేశాలను అందించే సాధనంగా మారాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతంలో మార్పులపై ప్రజలను అప్రమత్తం చేయడానికి యువ దర్శకులు ముందుకు రావాలని కోరారు. నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలను కథాంశాలుగా తీసుకుని లఘుచిత్రాలు రూపొందించాలని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, భవిష్యత్తు అవసరాలపై కూడా అవగాహన కల్పించే చిత్రాలు సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడతాయని పేర్కొన్నారు.
కళలు, సృజనాత్మకతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. యువతలోని ప్రతిభను గుర్తించి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణ నుంచి జాతీయ, అంతర్జాతీయ

ఇంటర్నెట్ వినియోగం
పిల్లల ప్రాథమిక హక్కు

మొదటి తరువాయి

ఆన్‌లైన్ వేదికలు విఫలమవుతున్నాయనే కారణంతో పిల్లలకు ఇంటర్నెట్‌ను నిరాకరించలేమని తెలిపింది. నిషేధం విధించినా పిల్లలు ఇంటర్నెట్ వినియోగాన్ని పూర్తిగా ఆపరని, నియంత్రణ లేని ఇతర వెబ్‌సైట్ల వైపు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు చదువు, సమాచారం పొందేందుకు ఇంటర్నెట్ ప్రధాన ఆధారంగా ఉంటోందని ధర్మాసనం గుర్తుచేసింది. అందువల్ల పిల్లలను ఆన్‌లైన్ ప్రపంచానికి దూరం చేయడం కంటే, వారిని ప్రమాదాల నుంచి రక్షించే చర్యలు తీసుకోవడం అవసరమని పేర్కొంది. సామాజిక మాధ్యమాలు సహా వివిధ ఆన్‌లైన్ వేదికల్లో హానికర సమాచారాన్ని గుర్తించి తొలగించేందుకు సమగ్ర జాతీయ డేటాబేస్‌ను రూపొందించాలని సూచించింది.

సీఈసీని తొలగించాలి.. బ్యాలెట్ పద్ధతిని తేవాలి!

చెన్నై

కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్నికల నిర్వహణ తీరుపై తమిళనాడులోని ప్రతిపక్ష డీఎంకే అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) స్థానంలో తిరిగి బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ తీర్మానాలు ఆమోదించింది.
శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ భేటీలో ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల సంఘం పనితీరు తదితర అంశాలపై చర్చించి నాలుగు తీర్మానాలను ఆమోదించినట్లు పార్టీ వెల్లడించింది.
ఎన్నికల నిర్వహణలో సీఈసీ విఫలమయ్యారని ఆరోపిస్తూ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని తొలి తీర్మానంలో డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొన్న పార్టీ.. వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించింది. అయితే అవకతవకలకు సంబంధించిన నిర్దిష్ట వివరాలను పార్టీ ప్రకటనలో వెల్లడించలేదు. రాష్ట్రపతికి అందించే వినతిపత్రంలో వాటిని వివరించే అవకాశం ఉందని సమాచారం.
విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ మరో తీర్మానాన్ని ఆమోదించింది. కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ ఇంకో తీర్మానం చేసింది. అయితే ఈ అంశాల్లో ఆయా పార్టీలు అనుసరిస్తున్న వైఖరికి సంబంధించిన వివరాలను డీఎంకే ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని రాష్ట్రపతిని కోరుతూ నాలుగో తీర్మానం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

విద్యార్థుల ఆందోళనతో అట్టుడికిన ఫ్రాన్స్

పారిస్

విద్యార్థుల ఆందోళనలతో ఫ్రాన్స్ మరోసారి అట్టుడికింది. విద్యావ్యవస్థలో సంస్కరణలు తేవాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా విద్యార్థులు చేస్తున్న ఆందోళన విధ్వంసానికి దారితీసింది. పారిస్‌లో ఒక కారు, దుకాణానికి నిప్పంటించారు. హుడీలు, మాస్కులు ధరించి పోలీసులపై బాణసంచా, ఇతర వస్తువులను విసురుతున్న ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్, జల గోళాలను ప్రయోగించారు. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో కూడా పెరుగుతున్న జీవన వ్యయాలకు నిరసనగా, విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా పౌరులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చింది:

మొదటి తరువాయి

కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు.
దేవాదుల ఎత్తిపోతల పథకంలో పది మోటార్లు నడపాల్సి ఉండగా, కేవలం మూడింటినే ఎందుకు నడుపుతున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిసినప్పటికీ, అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. పది మోటార్లను నిరంతరం నడిపి నీటిని ఎత్తిపోస్తే వరంగల్ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉండేదని అన్నారు. ఈ విషయాన్ని తాను పలుమార్లు ప్రస్తావించానని, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహా జిల్లా నాయకులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సమ్మక్క బ్యారేజీ దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అనుకూలంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏడాదిలో సుమారు 300 రోజుల పాటు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదని ఆరోపించారు. ముందుగానే నీటిని నిల్వ చేసి రిజర్వాయర్లు, చెరువులను నింపి ఉంటే ప్రస్తుత పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ పంటలు సాగవుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని వినియోగించుకుంటూ ఏపీ ప్రభుత్వం సాగునీటి అవసరాలను తీర్చుకుంటోందని అన్నారు. తెలంగాణలో వర్షపాతం లోటు 12 నుంచి 13 శాతం ఉండగా, ఏపీలో 25 శాతం వరకు ఉందని పేర్కొంటూ, అయినప్పటికీ అక్కడ పంటలకు నీరు అందుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో మాత్రం నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దేవాదుల మోటార్లన్నింటినీ నడిపి నీటిని ఎత్తిపోసి ఉంటే వరంగల్ జిల్లాలో కరువు పరిస్థితులు ఎందుకు ఏర్పడేవని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు

వార్తసంధ్య
www.vaarthasandhya.com

ఎల్బీనగర్ జోన్--13లో
అక్రమ నిర్మాణాల జోరు!

- వరుస కథనాలు.. ఫిర్యాదులు చేసినా చర్యలేవీ?

- టీపీఎస్, ఏసీపీ, డీసీ అధికారుల పర్యవేక్షణ ఏమైంది?

- మామూళ్ల మత్తులో మునిగిపోయారా? ప్రజల ప్రశ్నలు.. అధికారుల మౌనం!

హైదరాబాద్, అక్టోబరు 17 (వార్త సంధ్య -- ప్రత్యేక కథనం):

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్--13లో కొన్ని నిర్మాణాలపై అనుమానాలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వార్తా సంధ్యలో కథనాలు ప్రచురించినప్పటికీ, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినప్పటికీ, స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలపై అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయా? ఫిర్యాదులు అందిన తర్వాత అధికారులు ఏం చేశారు? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.

బైరామల్‌గూడ నుంచి మైత్రినగర్ వరకు.. అనుమతులపై అనుమానాలు!

ఎల్బీనగర్ జోన్--13 పరిధిలోని బైరామల్‌గూడలో ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా షెడ్డు నిర్మాణం, బహదూర్‌గూడలోని శకుంతల పారడైజ్ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం, మైత్రినగర్ కాలనీ ఎస్‌బీహెచ్ వెంచర్--3, రోడ్ నంబర్--1లో బెతెల్ సెన్నిట్ పాఠశాల ఎదురుగా మరో షెడ్డు నిర్మాణంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఉన్నాయా? మంజూరైన ప్రణాళికల ప్రకారమే పనులు జరుగుతున్నాయా? ఎన్ని అంతస్తులకు అనుమతులు ఇచ్చారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి.

నిర్మాణాలు జరుగుతున్నాయనే కారణంతోనే వాటిని అక్రమమైనవిగా నిర్ధారించలేం. అయితే, వాటిపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అనుమతి పత్రాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను వెల్లడించడం అధికారుల బాధ్యత. ఈ ప్రాంతాల్లో తనిఖీలు జరిగాయా? ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తిస్తే ఏ చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉంది.

గతంలో వార్తలు.. అధికారులకు ఫిర్యాదులు.. అయినా ఫలితం ఏది?

ఈ నిర్మాణాలపై గతంలో వార్తా సంధ్య కథనం ప్రచురించింది. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు ప్రతినిధి తెలిపారు. కొంతమంది స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు, డిప్యూటీ కమిషనర్ (డీసీ)కు ఫిర్యాదులు చేసినప్పటికీ, తమకు ఆశించిన పరిష్కారం లభించలేదని చెబుతున్నారు. ఫిర్యాదులు అందిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారా? నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారా? నోటీసులు ఇచ్చి ఉంటే వాటిని ఉల్లంఘించిన వారిపై తదుపరి చర్యలు తీసుకున్నారా? లేక నోటీసులకే పరిమితమయ్యారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, మీడియా ద్వారా ప్రశ్నించడం తప్పు కాదు. ఫిర్యాదులపై చర్యలు తీసుకున్న వివరాలను వెల్లడించడం అధికారుల బాధ్యత. ఒకవేళ ఫిర్యాదుల్లో వాస్తవాలు లేకపోతే వాటిని కూడా స్పష్టంగా తెలియజేయాలి. కానీ ఫిర్యాదులపై ఎలాంటి సమాచారం అందకపోతే ప్రజల్లో అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

నోటీసులేనా.. నిర్మాణాలు పూర్తయ్యేవరకు చూస్తారా?

భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు తేలితే, సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా నిర్మాణ పనులు కొనసాగితే వాటిని ఎందుకు అడ్డుకోవడం లేదన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలి. నిర్మాణాలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ఉల్లంఘనలు జరుగుతున్న సమయంలోనే గుర్తించి అడ్డుకోవడం ప్రజా ప్రయోజనాలకు ఉపయోగకరం. నోటీసులు ఇవ్వడమే చర్యగా పరిగణిస్తే నిబంధనల అమలు ఎలా సాధ్యమవుతుంది? ఫిర్యాదులపై అధికారులు స్పందిస్తున్న తీరు ఏమిటి? అన్న అంశాలను ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉంది.

దసరా సెలవుల మాటున నిర్మాణాలు పూర్తి చేసుకునే ప్రయత్నాలా?

ప్రభుత్వ కార్యాలయాలకు దసరా సెలవులు వచ్చే సమయంలో నిర్మాణ పనులు వేగవంతం చేసి, అధికారులు తిరిగి విధుల్లోకి వచ్చేలోపు పనులు పూర్తి చేసుకునే అవకాశం ఉందని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, పేర్కొన్న నిర్మాణాల విషయంలో అలాంటి ఉద్దేశం ఉందని నిర్ధారించే ఆధారాలు లేవు. అయినప్పటికీ, ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి, అనుమతుల వివరాలను పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. సెలవులు ఉన్నా ప్రజా సమస్యలపై అత్యవసరంగా స్పందించాల్సిన పరిస్థితుల్లో సంబంధిత యంత్రాంగం తన బాధ్యతలను నిర్వర్తించాలి.

సామాన్యుడికి ఒక న్యాయం.. నిర్మాణదారులకు మరో న్యాయమా?

సామాన్యులు చిన్నపాటి నిర్మాణ పనులు చేపట్టినా నిబంధనల పేరుతో అధికారులు తనిఖీలు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో, కొన్ని ప్రాంతాల్లో పట్టపగలే షీట్లు ఏర్పాటు చేస్తూ నిర్మాణ పనులు కొనసాగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. చెట్లకు ఆనుకుని లేదా చెట్లకు నష్టం కలిగించే విధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు ఉంటే వాటిపైనా సంబంధిత విభాగాలు పరిశీలన జరపాలి. చెట్లకు నష్టం జరుగుతోందా? ప్రజా ఆస్తులకు ఇబ్బంది కలుగుతోందా? నిర్మాణాలు అనుమతులకు అనుగుణంగా ఉన్నాయా? అన్న అంశాలను నిర్ధారించాలి. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలి. చిన్న నిర్మాణాల విషయంలో వేగంగా స్పందించే అధికారులు, పెద్ద నిర్మాణాల విషయంలోనూ అదే స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల చర్యల్లో తేడా ఉందనే భావన ప్రజల్లో కలిగితే ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది.

టీపీఎస్, ఏసీపీ, డీసీ అధికారులకు తెలియదా?

జోన్--13 పరిధిలోని నిర్మాణాలపై ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో సంబంధిత టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి (టీపీఎస్), అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ), డిప్యూటీ కమిషనర్ (డీసీ) స్థాయిలో పర్యవేక్షణ ఎలా జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నిర్మాణాల గురించి అధికారులకు సమాచారం ఉందా? ఫిర్యాదులు అందాయా? అందితే వాటిని పరిశీలించారా? తనిఖీలు నిర్వహించి ఏమైనా ఉల్లంఘనలు గుర్తించారా? చర్యలు తీసుకుని ఉంటే వాటి వివరాలు ఏమిటి? అన్న అంశాలపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. ఒకే పరిధిలో పలు నిర్మాణాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నప్పుడు, ఫిర్యాదులు అందినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు చెబుతున్నప్పుడు, ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని సాధారణ అంశంగా తీసుకోకూడదు. సంబంధిత అధికారుల పనితీరును సమీక్షించి, వాస్తవ పరిస్థితులను వెల్లడించాలి.

మామూళ్ల మత్తులో మునిగిపోయారా? ప్రజల అనుమానాలు!

నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా చర్యలు కనిపించడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యానికి కారణమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిర్మాణదారులు, సంబంధిత అధికారుల మధ్య మామూళ్ల వ్యవహారాలు ఏమైనా జరుగుతున్నాయా? అందుకే ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందా? అనే అనుమానాలను కొందరు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, సంబంధిత అధికారులు లంచాలు తీసుకున్నారని నిర్ధారించే ఆధారాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. అందువల్ల ఈ అనుమానాలను నిర్ధారిత వాస్తవాలుగా పేర్కొనడం సరికాదు. కానీ ప్రజల్లో ఇలాంటి అనుమానాలు తలెత్తడానికి కారణాలేమిటో ఉన్నతాధికారులు పరిశీలించాలి. ఫిర్యాదుల రికార్డులు, నిర్మాణ అనుమతులు, తనిఖీ నివేదికలు, జారీ చేసిన నోటీసులు, వాటి తర్వాత తీసుకున్న చర్యలను సమీక్షిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఎలాంటి ఉల్లంఘనలు లేని నిర్మాణాలపై అనవసర ఆరోపణలు రాకుండా అధికారిక వివరాలను వెల్లడించాలి.

ఏసీపీకి ఈ వ్యవహారం తెలుసా? తెలిసినా చర్యలు ఎందుకు లేవు?

అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) పరిధిలోని నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నప్పుడు ఆ వివరాలు సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లాయా? వెళ్లి ఉంటే వాటిపై ఏ చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఫిర్యాదులు అందినా నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఏసీపీ స్థాయిలో ఈ వ్యవహారాన్ని పరిశీలించారా? టీపీఎస్ నుంచి నివేదికలు తెప్పించారా? నిర్మాణాల అనుమతులను తనిఖీ చేశారా? అన్న వివరాలను అధికారులు వెల్లడించాలి. అధికారులపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తడం అంటే వారిని ముందుగానే దోషులుగా నిర్ధారించడం కాదు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యతను గుర్తుచేయడమే. నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉంటే ఆ విషయాన్ని అధికారికంగా వెల్లడించాలి. ఉల్లంఘనలు ఉంటే వాటిని అడ్డుకుని చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులపై స్పందించకపోవడం మాత్రం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.

అధికారి అర్చన స్పందించాల్సిన అవసరం లేదా?

నిర్మాణాలపై వివరణ కోరేందుకు టౌన్ ప్లానింగ్ అధికారి అర్చనను వార్త సంధ్య ప్రతినిధి పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన రాలేదని ప్రతినిధి తెలిపారు. ఫోన్ కాల్స్‌కు స్పందన లేకపోవడంతోపాటు, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలు స్పష్టంగా తెలియకపోవడం స్థానికుల అసంతృప్తికి కారణమవుతోంది. ఫోన్ కాల్స్‌కు స్పందించలేదన్న ఒక్క కారణంతోనే ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని నిర్ధారించలేం. అయినప్పటికీ, ప్రజా సమస్యలపై వివరణ కోరినప్పుడు అధికారులు స్పందించడం, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వెల్లడించడం అవసరం. ఈ కథనంపై అధికారి అర్చనతోపాటు సంబంధిత ఏసీపీ, డీసీ అధికారుల వివరణను ప్రచురించడానికి వార్త సంధ్య సిద్ధంగా ఉంది.

ఉన్నతాధికారులు స్పందిస్తారా? అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందా?

ఎల్బీనగర్ జోన్--13 పరిధిలో పేర్కొన్న నిర్మాణాలపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలి. టీపీఎస్, ఏసీపీ, డీసీ స్థాయిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాలి. నిర్మాణ అనుమతులు, మంజూరైన ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిస్థితులను తనిఖీ చేయాలి. ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజలు ఫిర్యాదులు చేయడం, మీడియా ప్రశ్నించడం, అధికారులు సమాధానాలు ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగం. వరుస కథనాలు వచ్చినా, అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా, స్థానికులు ఫిర్యాదులు చేసినా పరిష్కారం కనిపించడం లేదన్న ఆరోపణలు నిజమైతే వాటిని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించాలి. ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోతే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను అడ్డుకునే బాధ్యతాయుతమైన అధికారి ముందుకు వస్తారా? మామూళ్లపై వ్యక్తమవుతున్న అనుమానాలకు అధికారులు సమాధానం చెబుతారా? ఎల్బీనగర్ జోన్--13లో నిర్మాణాలపై సమగ్ర విచారణ ఎప్పుడు జరుగుతుంది?

ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రజల అనుమానాలను నివృత్తి చేసి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం అధికార యంత్రాంగం బాధ్యత.

--- వార్త సంధ్య, ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటుంది.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

జై స్వరాజ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేఎస్ఆర్ గౌడ

వరంగల్--ఖమ్మం--నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి ఏకాభిప్రాయ నిర్ణయం

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 17. వరంగల్--ఖమ్మం--నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జై స్వరాజ్ పార్టీ తరఫున ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ (కేఎస్ఆర్ గౌడ) పోటీ చేయాలని పార్టీ ఏకాభిప్రాయంతో నిర్ణయించింది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా బలంగా వినిపించడంతో పాటు, రాజకీయాల్లో కొత్త ఆలోచనలకు, కొత్త నాయకత్వానికి నాంది పలకాల్సిన అవసరం ఉందని పార్టీ భావించింది. అందులో భాగంగానే కేఎస్ఆర్ గౌడ అభ్యర్థిత్వాన్ని పార్టీ నాయకత్వం ఏకగ్రీవంగా ఆమోదించి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేయనుంది

"విద్య -- ఉద్యోగం -- ఉపాధి ప్రతి గ్రాడ్యుయేట్ హక్కు"

జర్నలిస్టుగా సుదీర్ఘకాలం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన కేఎస్ఆర్ గౌడ, తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజా ఉద్యమాలతో మమేకమై, జర్నలిస్టుల హక్కులు సామాన్య ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడారని పార్టీ పేర్కొంది. ప్రజా సమస్యలను దగ్గరగా చూసిన అనుభవంతోనే రాజకీయాల్లోకి వచ్చిన ఆయన, జై స్వరాజ్ పార్టీ ద్వారా గ్రామ స్వరాజ్యం, ప్రజలకు అధికారం, సామాజిక--ఆర్థిక సమానత్వం లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నారని పార్టీ తెలిపింది.

గ్రాడ్యుయేట్ల భవిష్యత్తుకు ప్రత్యేక రోడ్మ్యాప్

ఎమ్మెల్సీగా అవకాశం లభిస్తే వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ల కోసం ప్రత్యేక "విద్య--ఉద్యోగం--ఉపాధి భవిష్యత్ రోడ్మ్యాప్" రూపొందించేందుకు కృషి చేస్తామని కేఎస్ఆర్ గౌడ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి తదుపరి దశలో ఏ అవకాశాలు ఉన్నాయి, ఏ నైపుణ్యాలు అవసరం, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి కోసం ఎలాంటి మార్గాలు అందుబాటులో ఉన్నాయి అనే అంశాలపై సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రైవేట్ రంగంలో స్థానిక యువతకు అవకాశాలు, స్కిల్ డెవలప్మెంట్, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి, మహిళా గ్రాడ్యుయేట్లకు అవకాశాలు వంటి అంశాలను ఎమ్మెల్సీ వేదికగా ప్రాధాన్యంగా తీసుకెళ్తామని చెప్పారు.

రాజకీయ పరివర్తనకు గ్రాడ్యుయేట్ల ఓటు

ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఒక అభ్యర్థిని ఎన్నుకునే ఎన్నికలు కాదని, రాజకీయాల్లో మార్పు కోరుకునే విద్యావంతుల తీర్పుకు ప్రతీకగా నిలవాలని జై స్వరాజ్ పార్టీ పిలుపునిచ్చింది. డబ్బు, ప్రలోభాలు, సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా విధానాలు, ప్రజా సమస్యలు, జవాబుదారీతనం ఆధారంగా ఎన్నికల రాజకీయాలను ముందుకు తీసుకెళ్లాలని పార్టీ స్పష్టం చేసింది.

"విద్యావంతుల ఓటు మార్పుకు నాంది కావాలి. గ్రాడ్యుయేట్ల గొంతు శాసనమండలిలో వినిపించాలి." అని పార్టీ నాయకత్వం పేర్కొంది. వరంగల్--ఖమ్మం--నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మేధావులు, యువతతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దుతామని జై స్వరాజ్ పార్టీ ప్రకటించింది. కేఎస్ఆర్ గౌడ అభ్యర్థిత్వంతో ఈ ఎన్నికల్లో కొత్త రాజకీయ చర్చకు, రాజకీయ పరివర్తనకు నాంది పలుకుతామని పార్టీ నాయకత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.

రాష్ట్ర కమిటీ
జై స్వరాజ్ పార్టీ

ఎంపీ వద్దిరాజు కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ ఇష్టదైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 17. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు.కలియుగ ఇష్ట దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్న సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని తదితర కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర భక్తిప్రపత్తులతో స్వామి వారికి తలనీలాలు సమర్పించి తన మొక్కు చెల్లించుకున్నారు.స్వామి వారిని దర్శించుకునేందుకు తన కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన ఎంపీ రవిచంద్రకు వేద పండితులు సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఆశీర్వచనాలు పలికారు.ఎంపీ రవిచంద్రతో పాటు కుటుంబ సభ్యులు వద్దిరాజు ధీరజ్,వద్దిరాజు ప్రీతమ్,వద్దిరాజు గిరినందన్,జంగిలి రీశ్వన్త్ రెడ్డి, గంగుల సనవ్,గంగుల సౌరవ్ లు శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలి,నిండూనూరేళ్లు వర్ధిల్లాలి: ఎంపీ వద్దిరాజు తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి కరువు కాటకాలు నశించాలని,రాష్ట్రం,ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కలియుగ ఇష్ట దైవం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని వేడుకున్నారు.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు తిరిగి ముఖ్యమంత్రి కావాలని, ఆయురారోగ్యాలతో నిండూనూరేళ్లు వర్ధిల్లాలని స్వామి వారిని ఎంపీ రవిచంద్ర ప్రార్థించారు.

ఎంపీ వద్దిరాజు రాయదుర్గం మున్నూరుకాపు సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 17 : హైదరాబాద్ రాయదుర్గం మున్నూరుకాపు సంఘం ట్రస్ట్ కొత్తగా కట్టిన భవన సముదాయం ప్రారంభోత్సం ఉదయం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ నూతన పటేల్ భవన సముదాయం ప్రారంభోత్సం సందర్భంగా ఎంపీ రవిచంద్ర జ్యోతి ప్రజ్వలన గావించి,వేద పండితులు నిర్వహించిన గణపతి హోమం, శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.దేవీ నవరాత్రోత్సవాలు, విజయదశమి సందర్భంగా ఎంపీ రవిచంద్ర ట్రస్ట్ సభ్యులు, సంఘం కార్యవర్గం,బంధువులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.భవన నిర్మాణానికి చేయూత నందించి,ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ వద్దిరాజును శేరిలింగంపల్లి మునిసిపల్ మాజీ ఛైర్మన్,సంఘం ప్రముఖులు నర్సింగరావు ఆధ్వర్యంలో సభ్యులు శాలువాలతో సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు,ప్రముఖులు నాగం ఇందిర,నాగం స్వామి, రౌతు కనకయ్య,గాలి అనిల్ కుమార్,మరికల్ పోత సుధీర్ కుమార్,తూడి ప్రవీణ్,కొమిరిశెట్టి సాయిబాబా,సల్లా శ్రీనివాసరావు,బీరం శ్రీనివాస్,సల్లా కృష్ణ,రేగుల రాజు,పెంటా సంపత్,రేగుల రవి,టీ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ముందుచూపు లేకే విద్యుత్ కోతలు

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

-రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా ధర్నా

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్తా సంధ్య): రైతులకు కోతలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కామారెడ్డిలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేఎల్పీ ఉపనేత కాటిపల్లి వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్య నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడం వల్లే రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆరు నెలల ముందే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. గత ప్రభుత్వాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో విమర్శించడంపై చూపుతున్న శ్రద్ధను రైతుల సమస్యల పరిష్కారంపై చూపడం లేదని అన్నారు. ప్రస్తుత పంటకు తప్పనిసరిగా సాగునీరు అందించాలని, రానున్న యాసంగి పంట సాగుకు అవసరమైన నీటి సరఫరాపై ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి విషయంలో ఇప్పుడే తగిన నిర్ణయాలు తీసుకోకపోతే భవిష్యత్తులో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, పంటలకు నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా గుజ్జు సత్యనారాయణకు అవకాశం కల్పించాలి

హైదరాబాద్, (వార్తసంధ్య)అక్టోబర్ 17: గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా జాతీయ బీసీ ఉపాధ్యక్షుడు, బీసీ జాక్ రాష్ట్ర సమన్వయకర్త గుజ్జు సత్యనారాయణకు అవకాశం కల్పించాలని హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ పద్మశాలి వర్గానికి చెందిన గుజ్జు సత్యనారాయణను ఎమ్మెల్సీగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల బహిరంగ సభలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో గవర్నర్ కోటా నుంచి సత్యనారాయణకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా గుజ్జు సత్యనారాయణ మాట్లాడుతూ తనకు బీసీ వర్గాల నుంచి లభిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎమ్మెల్సీగా ఎంపిక చేస్తే బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జాతీయస్థాయిలో బీసీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించానని, ఆర్. కృష్ణతో కలిసి బీసీల సమస్యలపై అనేక ఉద్యమాల్లో పాల్గొన్నానని వివరించారు. బీసీల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొంటూ తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

దుబ్బాకలో ఘనంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

దుబ్బాక ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 17

దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెడ్డి సంఘం యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తిక గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, రెడ్డి సంఘం యూత్ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు.

దుర్గామాత మండపాలను దర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

వార్త సంధ్య కూకట్‌పల్లి : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్‌లోని దుర్గామాత మండపాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. తూమ్ శశాంక్, జిల్లా మనోజ్, శ్రవణ్ గుప్తాల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీకోడ్ దేవి మండపం వద్ద భజన కార్యక్రమం

భజన మండలికి దేవి ఉత్సవ కమిటీ సభ్యుల చిరు సత్కారం

దుబ్బాక ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 17: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి దేవి మండపం వద్ద జై శ్రీ రామ్, జై శ్రీమన్నారాయణ భజన మండలి సభ్యులు భక్తి శ్రద్ధలతో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు ఆలపించిన భక్తి గీతాలతో దేవి మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తి పాటలతో భక్తులను అలరించారు. అనంతరం భజన కార్యక్రమాన్ని నిర్వహించిన మండలి సభ్యులను దేవి ఉత్సవ కమిటీ సభ్యులు చిరు సత్కారం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవి ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం

అంతటా హింస ధ్వనే

వాళ్లు అమ్మాయిల్ని కొట్టారు, యువకుల్ని, పిల్లల్ని కొట్టారు. నినాదాలు ఇస్తున్న వారిని, రోడ్ల వెంట నడుస్తున్న వారిని, ఆసుపత్రికి, ఆఫీసుకి వెళుతున్న వాళ్ళని, చట్టాన్ని కాపాడే లాయర్లను కొట్టా రు. రైతులను, చదువు చెప్పే యూనివర్శిటీ ప్రొఫెసర్‌లనూ కొట్టారు, ప్రతిపక్ష పార్టీల వారిని కొట్టారు. లక్షలాది మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులైన అనేక మంది ఎంఎల్‌ఎలను, ఎంపిలను కొట్టారు. అడ్డుకోవడం, ఈడ్చివేయడం, కిందపడేసి నలుగురు కలిసి జుట్టుపట్టి లాక్కు వెళ్లడం పోలీసు వ్యాన్లలోకి విసిరివేయడం, దుస్తులు చించేయడం, నెత్తురు కారేలా విచక్షణారహితంగా కొట్టడం, ఇదంతా ఢిల్లీ నడి వీధులలోనే కొన్నాళ్ళుగా జరుగుతూ ఉంది. చివరికి వాళ్ళు వందలాదిమందిని అరెస్టులు చేశారు. వీరందరినీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిర్బంధ శిబిరాలకు తీసుకువెళ్లారు. అనేక మందిపై కేసులు పెట్టారు. చివరికి తమ వృత్తి ధర్మంలో భాగంగా రిపోర్టు చేయడానికి వచ్చిన జర్నలిస్టులను కూడా విచక్షణారహితంగా కొట్టారు. అరెస్టులు చేశారు. పత్రికా స్వేచ్ఛ అపహాస్యం పాలై, మీడియా రెక్కలు విరుగుతున్నాయి. ఢిల్లీలో జరుగుతున్న ఇలాంటి అనేక ఘటనలను దేశ ప్రజలు నివ్వెరపోయి చూస్తూ ఉన్నారు. భారత దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అనేక అంతర్జాతీయ సంస్థలు పదే పదే హెచ్చరిస్తూ ఉన్నాయి. ఢిల్లీలో ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్‌ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఆందోళనలను రిపోర్టు చేసేందుకు వెళ్ళిన పత్రికా విలేకరులలో కనీసం 37 మంది జర్నలిస్టులను అక్టోబర్ 10, 11 తేదీలలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మహిళలు కూడా ఉన్నారు. వీళ్లలో కొందరిని తీవ్రంగా కొట్టారు. వారి ఫోన్‌లను, కెమెరాలను లాక్కున్నారు. ఫుటేజ్ డిలీట్ చేయమని ఒత్తిడి చేసారు. బలవంతంగా రోడ్లపై జర్నలిస్టులను ఈడ్చుకుని వెళ్ళారు. న్యూస్ లాండ్రి, స్క్రోల్, బిజినెస్ స్టాండర్డ్, పీక్ న్యూస్, ది హిందు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, నవ భారత్, చివరికి బిబిసి విలేకరులు కూడా నిర్బంధాన్ని ఎదుర్కొన్న వారిలో ఉన్నారు. 'న్యూస్ లాండ్రీ'కి చెందిన అశ్విని కుమార్ సింగ్, ఆస్తా సవ్యసాచి, అన్మోల్ ప్రీతమ్, 'స్క్రోల్'కు చెందిన ఆయుష్ తివారి తదితరులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకూ నిబంధనలున్నాయి. వారు డ్యూటీలో తప్పనిసరిగా గుర్తింపు బ్యాడ్జీలు, ఖాకీ దుస్తులు ధరించాలి. అతిగా ప్రవర్తించిన, పరిధులను అతిక్రమించిన పోలీసులపైన బాధితులకి ఫిర్యాదు చేసే హక్కు వుంది. కానీ ఇప్పుడు అత్యంత ఆందోళన కలిగిస్తున్న విషయం ఏమిటంటే, నేమ్ ప్లేట్లు లేకుండా, ఖాకీ దుస్తులు వేసుకున్న వ్యక్తులు. నెంబర్ ప్లేట్ లేని వాహనాల్లో నిరసనకారులను కొడుతూ తీసుకు వెడుతున్న వాళ్ళు, తమనితాము పోలీసులమని చెప్పుకుంటూ ఉన్నారు. వీరిలో ఆడ, మగ పేరు లేని పోలీసులు ఉన్నారు. అసలు వీళ్ళు నిజంగా పోలీసులేనా? సరికొత్త ఖాకీ దుస్తులు, లాఠీలతో నిండిన వాహనాలను ఢిల్లీ వీధుల్లో నిరసనకారులు, పత్రికా విలేకరులు పోలీసు అధికారులకు చూపినా, వాళ్ళు ఎందుకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మరో ఒక వంక, హిందూ సేన, ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్ దళ్ వాళ్ళం మేము, హిందూ మతాన్ని, ధర్మాన్ని రక్షించడానికి వచ్చాం, ఢిల్లీ పోలీసులకు మేము అండగా నిలబడతాం అని బాహాటంగా చెబుతూ వీధుల్లో బృందాలుగా తిరుగుతూ వున్నారు కొందరు. వీరు నిరసన తెలుపుతున్న వాళ్ళపై దాడులు, అమ్మాయిలు, మహిళా విలేకరులపై లైంగిక వేధింపులు చేస్తున్నారు. పోలీసులుతోపాటు తిరుగుతూ, ప్రదర్శనకారులపై దాడులకు దిగుతున్న ఈ వ్యక్తులు ఎవరు? అసలు ఎవరు వీళ్ళని పంపారు? ఎక్కడి నుంచి వచ్చారు? పోలీసుల కళ్ల ముందే ఇదంతా జరిగినా, పోలీసులు వీరిని ఎందుకు ఏమీ అనడం లేదు? అమ్మాయిలతో అసభ్యంగా ప్రవర్తించిన ఇలాంటి వాళ్ళలో కొందరిని ప్రజల ఒత్తిడివల్ల అరెస్టు చేసినా, వెంటనే ఎందుకు వదిలేస్తున్నారు? అనే సందేహాలు దేశమంతటా అందరికీ కలుగుతున్నాయి. నీట్ పేపర్ లీక్, ధర్మేంద్ర పధాన్ రాజీనామా చేయాలనీ అంటూ జరిగిన జంతర్ మంతర్ -1, నిరసనల్లో కూడా సాదా దుస్తులు ధరించిన వ్యక్తులు లాఠీలు చేతబట్టి నిరసనకారులపై దాడి చేశారనే ఆరోపణలు వచ్చాయి. పోలీసులు వీళ్ళని స్పాటర్స్ అని, క్రౌడ్ కంట్రోల్ కోసం స్పెషల్ బ్రాంచ్, క్రైమ్ బ్రాంచ్ నుంచి వాళ్ళు వచ్చారని చెప్పారు మొదట. దీనిపై అనేక విమర్శలు వచ్చాక, ఇలాంటి వాళ్ళకు యూనిఫాం మాత్రమే ధరించాలి, సాదా దుస్తులు వద్దు అని ఆదేశాలు ఇచ్చారని అంటారు. అందుకే జన్ జీ తరం వీళ్ళని ఇప్పుడే అమెజాన్ నుండి ఖాకీ దుస్తులు ఆర్డర్ చేసుకుని, వేసుకుని వచ్చారు అని, వర్దీ చోడో, ఆర్‌ఎస్‌ఎస్ నిక్కర్ పైనో అంటూ పోలీసులను ఎగతాళి చేసింది. ఏతా వాతా, ఏ వేషాలలో వున్నా, నిరసనలను అణచివేసే ప్రైవేటు మూకలకు ప్రభుత్వం అనేక అధికారాలు ఇచ్చింది అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లైంగిక దాడులు అమ్మాయిలపైనా, కొందరు అబ్బాయిలపై నా కూడా జరిగాయి. స్త్రీలను కంట్రోల్ చేసేందుకు, భయపెట్టేందుకు, లొంగదీసేందుకు లైంగిక దాడిని ఒక ఆయుధంగా వాడతారు అని మహిళలు ఎప్పటి నుండో చెబుతూనే ఉన్నారు. లైంగిక హింసను లక్ష్యంగా చేసుకుని గ్రోపింగ్, బట్టలు లాగడం, ఫొటోలు, వీడియోలు తీసి డాక్సింగ్ చేయడం, రేప్ బెదిరింపులు, బాహాటంగా చేశారు. జులైలో జరిగిన నీట్ పేపర్ల లీక్ వ్యతిరేక నిరసనల తర్వాత, మహిళా నిరసనకారులపై ఆన్‌లైన్‌లో రేప్ చేస్తామని, చంపుతాం అనే బెదిరింపులు, అసభ్యంగా మార్ఫింగ్ చేసిన ఫొటోలు, అమ్మాయిల చిరునామాలు బయటపెట్టడం వంటివి విస్తృతంగా జరిగాయి. నేహా బోరాను అదుపులోకి తీసుకుంటున్నప్పుడు ఆమె లైంగిక హింస ప్రయోగించడం అన్నది ఇంట్లో ఉండు, వీధుల్లోకి రాకు నువ్వు అని స్త్రీలకు చెప్పే సాధనం కూడా. నేమ్‌ప్లేట్లు లేని మహిళా కానిస్టేబు ల్స్ కూడా లైంగిక హింస చేశారు. అసలు వీళ్ళు నిజమైన పోలీసులా లేక ఏ 'దుర్గా వాహిని' వంటి ఆర్‌ఎస్‌ఎస్ మహిళా విభాగాలకు చెందిన వారా అనే అనుమానాలు కూడా ప్రజలలో లేకపోలేదు. ఈ మహిళా కానిస్టేబుల్స్ చాలా మంది రొమ్ములు, ప్రైవేట్ భాగాలపై కొట్టడం, ఊపిరి ఆపడం, బూతులు, రేప్ బెదిరింపులు వంటివి చేశారు. ఛాతీని నొక్కి వెనక్కి నెట్టారని, ఎస్‌ఎఫ్‌ఐ వంటి సంఘాలు, మహిళా నిరసనకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులపై మగ పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం, గ్రోపింగ్ చేశారని నిరసనకారులు ఫిర్యాదు చేశారు. లైంగిక హింస ప్రయోగించడం అన్నది ఇంట్లో ఉండు, వీధుల్లోకి రాకు నువ్వు అని స్త్రీలకు చెప్పే సాధనం కూడా. నేమ్‌ప్లేట్లు లేని మహిళా కానిస్టేబుల్స్ కూడా లైంగిక హింస చేశారు. అసలు వీళ్ళు నిజమైన పోలీసులా లేక ఏ 'దుర్గా వాహిని' వంటి ఆర్‌ఎస్‌ఎస్ మహిళా విభాగాలకు చెందిన వారా అనే అనుమానాలు కూడా ప్రజలలో లేకపోలేదు. ఈ మహిళా కానిస్టేబుల్స్ చాలా మంది రొమ్ములు, ప్రైవేట్ భాగాలపై కొట్టడం, ఊపిరి ఆపడం, బూతులు, రేప్ బెదిరింపులు వంటివి చేశారు. విద్యార్థి సంఘాల నిరసనకారులను, మహిళలను అదుపులోకి తీసుకునేటప్పుడు మగ పోలీసులే కాదు ఆడ పోలీసులు కూడా అనుచితంగా తాకడం, కుర్తా ఎత్తడం వంటి లైంగిక అవమానాలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. పితృస్వామ్యాన్ని, నియంతృత్వాన్ని సమర్థించే ఫాసిస్టు స్త్రీలు కూడా వుంటారన్నది చరిత్రలో రుజువైన సత్యమే. అశోకా రో యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్ అదుపులో ఉన్నప్పుడు, ఒక పోలీసు వెనుకనుంచి వాళ్ళని అభ్యంతరకరంగా తాకాడన్న ఆరోపణలు కొన్ని మాధ్యమాల్లో వచ్చాయి.

పంజాబ్‌లో డ్రగ్ మాఫియా పంజా

పంజాబ్‌లో మాదకద్రవ్యాల పులిపంజా ఎన్నో జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. యువత దీనికి బానిసై చిత్తయిపోతుండగా, దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు సాగించే సాహసవంతుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రముఖ సామాజిక ఉద్యమనేత పర్వీందర్ సింగ్ ఝోటా మంగళవారం ఉదయం ఒక ఫార్మాసిస్ట్ చేతిలో హత్యకు గురికావడం తీవ్ర సంచలనం కలిగించింది. పర్వీందర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు అతని తండ్రి ఒప్పుకోలేదు సరికదా, గురువారం రాష్ట్ర వ్యాప్తంగా సంపూర్ణ బంద్‌కు పిలుపు ఇచ్చారు. దాదాపు అన్ని వర్గాల నుంచి ఈ బంద్‌కు పూర్తి మద్దతు లభించింది. కాంగ్రెస్, బిజెపి, శిరోమణి అకాలీదళ్, వారిస్ పంజాబ్ దే వంటి రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, మత సంస్థలు బంద్‌కు ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చాయి. పర్వీందర్ సింగ్ గతంలో మాదక ద్రవ్యాల బానిసైనవారే. ఆ వ్యసనాన్ని విడిచిపెట్టి పరివర్తనం చెందారు. మాదక ద్రవ్యాల అక్రమ విక్రయాలను అడ్డుకుంటేనే కానీ యువత బతుకులు బాగుపడవన్న లక్ష్యంతో "ఫోర్స్" అనే సంస్థ ద్వారా ఉద్యమం చేపట్టారు. అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న దృశ్యాలను తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి, వాటిని ఫేస్‌బుక్‌లో ప్రసారం చేసేవారు. ఈ విధంగా మంగళవారం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న సమయం లోనే ఆయన హత్య కూడా రికార్డు కావడం అత్యంత శోచనీయం. పంజాబ్‌లో ఈ సంఘటన ప్రజాగ్రహానికి దారి తీసింది. మరోవైపు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మ్యాడ్ సంధు కూడా హత్యకు గురి కావడం వెనుక అంతర్రాష్ట్ర డ్రగ్ మాఫియా హస్తం ఉందని తెలుస్తోంది. ఈ రెండు సంఘటనల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల పాత్ర కనిపిస్తోంది. ఒకవైపు స్థానికంగా మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుండగా, మరోవైపు మాఫియా సిండికేట్లు నిర్భయంగా తమ జూలు విదిల్చి హత్యలకు పాల్పడుతున్నాయి.

దీంతో ప్రజల భద్రత ప్రమాదంలో పడుతోంది. ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పోలీసులు కూడా పాత్ర వహించడం, కొందరు పోలీసులు హత్యలకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం రెండు వారాల వ్యవధి లోనే తర్న్‌తరన్, అమృత్‌సర్ జిల్లాలో ఇద్దరు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కాల్పులకు గురయ్యారు. పంజాబ్ పోలీస్ కానిస్టేబుల్ కరణ్ దీప్ సింగ్ పెద్ద మొత్తంలో హెరాయిన్‌తో పట్టుబడడం గమనార్హం. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, మాదక ద్రవ్యాల మాఫియా తన కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉంది. కానీ ప్రస్తుత ఆమ్‌ఆద్మీ ప్రభుత్వంపై శాంతిభద్రతల సంరక్షణలో వైఫల్యాలు తీవ్రంగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. 2025లో పంజాబ్ ప్రభుత్వం "యుద్ధ నషియాన్ విరుద్ధ్ " అనే ప్రణాళికతో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు 68,850 మందిని అరెస్టు చేసింది. అలాగే రూ. 319 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. అయితే ఇంతటితో సమస్య తీరిపోలేదు. ముఖ్యంగా యువతలో నిరుద్యోగం తదితర సమస్యలపై నిరాశా నిస్పృహలే మాదక ద్రవ్యాల బానిసత్వానికి దారి తీస్తున్నాయి. రాష్ట్రంలో ఉద్యోగాలు దొరకవని, విదేశాలకు వెళ్లడమే ఏకైక మార్గమన్న అభిప్రాయం ఎక్కువగా ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్ కోసం ఎంతఖర్చయినా వెనుకాడకుండా విదేశాలకు పంపించాలన్న ఆలోచనలో ఉంటున్నారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సర్వేలో 201718 సంవత్సరంలో 10 నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు గల పంజాబ్ జనాభాలో 1.28 శాతం మంది ఓపియాయిడ్ మాదక ద్రవ్యాలపై ఆధారపడే స్థితిలో ఉన్నారని తేలింది. ఛండీగఢ్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సరిహద్దు జిల్లా లకు చెందిన 1527 మందిపై చేసిన అధ్యయనంలో పంజాబ్‌లో మాదక ద్రవ్యాల బానిసలు 15 నుంచి 35 సంవత్సరాల మధ్యవయస్సు వారే అని బయటపడింది. అలాగే గ్రామీణ ప్రాంతానికి చెందిన వారిలో దాదాపు 70 శాతం మంది మత్తుకు చిత్తవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సంక్షోభం నుంచి యువతను తప్పించడానికి పర్వీందర్ ఝోటా ఉద్యమం సాగించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతలో చైతన్యం తీసుకు రావడమే కాకుండా, పలు గ్రామ పంచాయితీలతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేయించారు. ఇవన్నీ డ్రగ్స్ మాఫియాకు అడ్డంకి కలిగించే చర్యలే. ఈ మాదక ద్రవ్యాల సమస్య అనేది కేవలం ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది అక్రమ ఆర్థిక వ్యవస్థ, గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్, సరిహద్దుల మీదుగా స్మగ్లింగ్, ఇవన్నీ టార్గెట్ చేసుకుని సాగించే హత్యలు, ప్రజల భద్రతలో లోపాలు వంటి అనేక తీవ్ర సమస్యలతో ముడిపడి ఉన్న తీవ్ర సామాజిక, చట్టపరమైన సమస్య. దశాబ్దాలుగా అనేక హింసాత్మక సంఘటనలను చూసిన పంజాబ్ మళ్లీ "చిట్టా వే" రోజుల నాటి పరిస్థితులకు వెళ్లకూడదని ప్రజలు ఆశిస్తున్నారు. ఆ రోజుల్లో హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలు యువతకు సాధారణ అలవాటుగా మారాయి. రానున్న ఎన్నికలు భగవంత్‌మాన్ ప్రభుత్వానికి ఎన్నో సవాళ్లను తీసుకు రానుంది. అందుకనే ఆమ్ ఆద్మీ ప్రభుత్వం మాదక ద్రవ్యాలను అరికట్టడానికి రెండు విధాల ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రణాళిక ఎంతవరకు ఆచరణ లోకి వస్తుందో చెప్పలేం. పర్వీందర్ లాంటి సామాజిక ఉద్యమ నేతలు సాహసించి ప్రజాచైతన్యం రగిలిస్తేనే మాఫియా మహమ్మారిని అడ్డుకోగలుగుతారు. దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించవలసి ఉంది.

నిరంతర విద్యుత్తు ఏమైపోయాయె?

రాష్ట్రంలో విద్యుత్తు కోతలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. వ్యవసాయానికి సరిపడా కరెంటు అందడం లేదు. రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేస్తున్నారు.వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు విద్యుత్తు అంతరాయాలు అదనపు భారంగా మారుతున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో పలు ప్రాంతాల్లో రైతులు నిరసనలకు దిగారు. ఈ పరిస్థితుల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా ఇప్పుడు ఏమైపోయిందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతున్నది. ప్రభుత్వం చెప్తున్న విద్యుత్తు సరఫరా లెక్కలకు, రైతులు అనుభవిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య తేడా ఎందుకు కనిపిస్తున్నది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వ పెద్దలు రాజకీయ ఆరోపణలతో ఎదురుదాడికి పాల్పడకుండా వాస్తవాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.



రైతుల పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సరిపడా ఎరువులు దొరకక ఆందోళనలో చిక్కుకున్నారు. ఇటువంటి సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో విద్యుత్తు కోతలు మరో సంక్షోభాన్ని సృష్టించాయి. ఆ సంక్షోభంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కరెంటు ఎప్పు డు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో పొలాలకు వెళ్లాల్సి రావడం, మోటార్ల వద్ద వేచి ఉండటం, తక్కువ వోల్టేజీతో పంపుసెట్లు దెబ్బతినడం వంటి సమస్యలతో రైతులు నష్టపోతున్నారు. విద్యుత్తు అంతరాయాలతో పంటకు సరైన సమయంలో నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. పంట నష్టపోతే దాని ప్రభావం తర్వాతి సాగు పెట్టుబడులపైనా పడుతుంది. విద్యుత్తు కోతల సమస్య సాగుతోనే ఆగిపోదు. చిన్న పరిశ్రమలు, వర్క్‌షాపులు, దుకాణాలు, సేవారంగ సంస్థల పని కూడా విద్యుత్తుపై ఆధారపడుతుంది. కోతల వల్ల ఉత్పత్తి నిలిచిపోతుంది. పనివేళల నష్టం, జనరేటర్ల ఏర్పాటుతో ఖర్చులు పెరుగుతాయి. గృహ వినియోగదారులపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతుంది. ప్రజలకు అవసరమైన మేరకు విద్యుత్తును అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చూడాలి. లోటు ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు చేయాలి. ఇందుకోసం ప్రణాళికతో పని చేయాలి. బొగ్గు సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలి. ఉత్పత్తి కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి. ప్రసార, పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయడం కూడా అంతే ముఖ్యం. విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ముందస్తు ప్రణాళిక అవసరం పెరుగుతుంది. రాష్ట్రంలో 202425 ఆర్థిక సంవత్సరంలో నమోదైన విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లు కాగా, 202526లో అది 18,548 మెగావాట్లకు చేరింది. అంటే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, కొనుగోళ్లు, సరఫరా వ్యవస్థలను నిరంతరం బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. ఏ ప్రాంతంలో ఎంత విద్యుత్తు సరఫరా చేస్తున్నారు? ఎంతసేపు అంతరాయాలు ఏర్పడుతున్నాయి? అందుకు కారణం ఏంటో చెప్పాలి. ఉత్పత్తి తగ్గిందా? స్థానిక లైన్లుట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? ప్రజలకు వెల్లడించాలి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్తును సరఫరా చేసింది. ప్రస్తుత ప్రభుత్వం అదే స్థాయి సేవను కొనసాగించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నది? అంటే సమాధానం లేదు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలు, ఉత్పత్తి కేంద్రాల పనితీరు, బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థలోని బలహీనతలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో అనసవర నిందలు వేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఈ విషయం కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి. విద్యుత్తు సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం తక్షణ, దీర్ఘకాలిక చర్యలను సమాంతరంగా చేపట్టాలి. ముందుగా వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా షెడ్యూల్‌ను గ్రామాల వారీగా ప్రకటించాలి. అనివార్యమైన అంతరాయాలు ఏర్పడితే రైతులకు ముందుగానే సమాచారం అందించాలి. సబ్ స్టేషన్లలో సరఫరా సమయాలను నమోదు చేసి, వాటిని ప్రజలకు అందుబాటులో పెట్టాలి. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తక్కువ వోల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పరిశీలించాలి. ఓవర్‌లోడింగ్ ఉన్న ప్రాంతాల్లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలి. మరమ్మతులు, నిర్వహణను ముందస్తు స్పష్టమైన ప్రణాళిక అమలు చేయాలి. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యం, బొగ్గు సరఫరా, విద్యుత్తు కొనుగోళ్లను సమీక్షిస్తూ నెల ముందుగానే అంచనా వేయాలి. సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచడంతోపాటు, అవసరమైన చోట నిల్వ సాంకేతికతను అభివృద్ధి చేయడం కూడా దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి. విద్యుత్తు సంస్థల ఆర్థిక పరిస్థితిని నిర్లక్ష్యం చేయకూడదు. సరఫరా వ్యయం, ఒప్పందాలు, బకాయిలు, రాయితీల చెల్లింపులపై పారదర్శకత అవసరం. విద్యుత్తు నాణ్యత, సరఫరా తగ్గకూడదు. ఉచిత విద్యుత్తు పథకాలు కొనసాగించాలి. అవసరమైన నిధులు, విద్యుత్తు లభ్యతపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి. అనుభవ రాహిత్యంతో వ్యవహరిస్తున్న సీఎం భేషజాలకు పోకుండా ప్రజల ఇబ్బందులను పరిష్కరించేలా కృషి చేయాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేవని ప్రభుత్వం బుకాయిస్తున్నది. మరి సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారో మంత్రులు వివరించాలి. సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలి. ఎక్కడైనా సరఫరా లోపం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ సాధించిన అభివృద్ధిలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు కీలక పాత్ర పోషించాయి. ఆ ప్రగతి కొనసాగాలంటే విద్యుత్తు సరఫరాలో స్థిరత్వం ఉండాలి. ప్రభుత్వం ముందున్న పని ఒక్కటే. విద్యుత్తు సరఫరాపై ప్రకటనలు ఎన్ని చేశారనేది కాదు, ప్రజలకు నాణ్యమైన కరెంటును ఎంత నిరంతరంగా అందించారనేది ముఖ్యం. మాటల కు, చేతలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తేనే విద్యుత్తు కోతల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేవని ప్రభుత్వం బుకాయిస్తున్నది. మరి సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారో మంత్రులు వివరించాలి. సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలి. ఎక్కడైనా సరఫరా లోపం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ సాధించిన అభివృద్ధిలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు కీలక పాత్ర పోషించాయి.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

వార్త సంధ్య కూకట్‌పల్లి :
మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, కూకట్‌పల్లిలోని 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భారతీయ జనతా పార్టీ 251వ డివిజన్ వసంత్ నగర్ అధ్యక్షురాలు ఎన్. రత్నకుమారి ఆధ్వర్యంలో, సాయి కృష్ణ రాజు, శంకర్ రాజు. సహకారంతో ఈ ప్రక్రియ నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా నిర్వహకులు మాట్లాడుతూ, పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.
చివరి తేదీ: నవంబర్ 5వ తేదీ వరకు
సమయం: ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు , 6వ ఫేజ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కూకట్‌పల్లి
ఈ కార్యక్రమ నిర్వహణలో అసోసియేషన్ సభ్యులు శివశంకర్ రెడ్డి, సుబ్బరాజు, రమణ రావు, సత్యనారాయణ, గాయత్రి, భానుమతి తో పాటు ఎమ్మెల్సీ 251వ డివిజన్ కన్వీనర్ గురు ప్రసాద్, సాయి కృష్ణ రాజు, శంకర్ రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
కార్యక్రమానికి సహకరించిన అసోసియేషన్ సభ్యులకు, నాయకులకు నాయకత్వం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఆరోగ్యమే నిజమైన సంపద: బండి రమేష్

వార్త సంధ్య కూకట్‌పల్లి :
బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో పాస్టర్ క్రిస్టఫర్ మరియు సులోచన ఆధ్వర్యంలో "హెల్త్ ఈజ్ ఏ బ్లెస్సింగ్" నినాదంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజన్నతో పాటు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద అని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. నేటి బిజీ జీవితంలో అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఇలాంటి వైద్య పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొంటూ, నిర్వాహకులు పాస్టర్ క్రిస్టఫర్, సులోచనలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, మధు మోహన్, జిల్లా శివ, జావిద్, రేణుక, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు తెలంగాణ ఆడబిడ్డలందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 17. :
సద్దుల బతుకమ్మ పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ఆడబిడ్డలందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన ఈ పండుగ సందర్భంగా ఆడబిడ్డలు ప్రకృతిని,పువ్వులను, గౌరమ్మను ఆరాధిస్తారని, బంధుమిత్రులతో కలిసి ఇష్టంగా, ఉత్సాహంగా, సంతోషంగా జరుపుకుంటారన్నారు.ఈ పండుగ చివరి రోజు తొమ్మిదవ రోజున ఆడబిడ్డలు తంగేడు,గునుగు,గుమ్మడి, బంతి,చామంతి తదితర తీరొక్క పూలతో ఆడబిడ్డలు బతుకమ్మలను ఆకర్షణీయంగా పేర్చి పిల్లాపాపలతో కలిసి ఆడిపాడుతారన్నారు.అనాదిగా ఎంతో విశిష్టత కలిగిన ఈ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పడుతుందని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు.మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వాన ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా బతుకమ్మ పండుగ ప్రజలను మరింత ఐకమత్యంతో ముందుకు నడిపించిందని ఆయన చెప్పారు.కేసీఆర్ పాలనలో ఈ పండుగను అధికారికంగా జరిపించారని,మరింత ప్రాచుర్యం తీసుకువచ్చారని.. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించడంతో ప్రఖ్యాత "ఆక్స్ ఫర్డ్"డిక్షనరీలో "బతుకమ్మ"పదం చేర్చబడిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.ఈ విశిష్టమైన పండుగ సందర్భంగా రాష్ట్రంలోని లోని మహిళామణులు, దేశవిదేశాల్లో స్థిరపడిన, నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలందరికి ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీలకతీతంగా అందరూ పాల్గొని దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి: షబ్బీర్ అలీ

-కామారెడ్డిలో దసరా ఉత్సవ కమిటీ నియామకం.. 25 మందితో కమిటీ ఏర్పాటు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వార్తా సంధ్య): అక్టోబర్ 17
కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ కలిసి విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణ కోసం 25 మంది సభ్యులతో కమిటీని నియమించినట్లు ఆయన వెల్లడించారు.శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేక ఆహ్వాన పత్రికలు పంపించి ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు.
అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు
ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, క్రీడలు, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని షబ్బీర్ అలీ సూచించారు. ప్రజల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.
తాగునీరు, భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం
ఉత్సవాలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేడుకల్లో పాల్గొనే ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజలు సమష్టిగా సహకరించాలని షబ్బీర్ అలీ కోరారు. ప్రజలందరూ కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉసిరికాయలపల్లిలో ఘనంగా శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర.. సర్వం సిద్ధం!

-ఈనెల 20 నుంచి 26 వరకు జాతర మహోత్సవాలు

-భక్తులకు ఆధ్యాత్మిక శోభ.. చిన్నారులకు వినోదాల సందడి

సింగరేణి ప్రతినిధి, అక్టోబర్ 17 (వార్త సంధ్య):
సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుదీరిన భక్తజన కల్పవల్లి శ్రీశ్రీశ్రీ కోటమైసమ్మ తల్లి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న జాతర ఉత్సవాల కోసం గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు చిన్నారులు, యువతను అలరించేలా ప్రత్యేక వినోద కార్యక్రమాలను సిద్ధం చేశారు.
విద్యుద్దీపాలతో ఆలయం ముస్తాబు
జాతరను పురస్కరించుకుని ఉసిరికాయలపల్లి గ్రామం పండుగ శోభను సంతరించుకుంది. ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సింగరేణి మండలంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు.
జాయింట్ వీల్స్.. బ్రేక్ డాన్స్ ప్రత్యేక ఆకర్షణ
జాతరలో భక్తుల సందడిని మరింత పెంచేందుకు వివిధ రకాల వినోద యంత్రాలను ఏర్పాటు చేశారు. జాయింట్ వీల్స్ (రాట్నాలు), బ్రేక్ డాన్స్, పిల్లల రైళ్లు తదితర వినోద పరికరాలు సందర్శకులను ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా చిన్నారులు, యువతకు ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.
ప్రత్యేక పూజలు.. బోనాలు, ఒడిబియ్యం సమర్పణ
జాతర సందర్భంగా అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం సమర్పించడంతో పాటు ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై ఆలయ కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆలయ కమిటీ, పోలీసు శాఖ సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.
భక్తులకు ఆలయ కమిటీ ఆహ్వానం
శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవాలయ చైర్మన్ డాక్టర్ పర్స పట్టాభి రామారావు, కార్యనిర్వాహక అధికారి కే. వెంకటయ్య, అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, సాయిరాం శర్మ, సిబ్బంది లలిత సాయి, పగడాల మోహన్ కృష్ణ కోరారు. జాతరను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఎంపీ వద్దిరాజు కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలం సందర్శన

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 17. :
బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి తమిళనాడులోని సుప్రసిద్ధ అరుణాచలం ఆలయాన్ని సందర్శించారు.ఎంపీ రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీ, కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని తదితర కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం అరుణాచలేశ్వర (పరమశివుడు) స్వామి వారిని దర్శించుకుని తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త,వేద పండితులు ఎంపీ రవిచంద్ర,ఆయన కుటుంబ సభ్యులకు సాదర స్వాగతం పలికి, స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను బహుకరించారు.ఎంపీ రవిచంద్ర వెంట ఆయన కుటుంబ సభ్యులు వద్దిరాజు ధీరజ్, వద్దిరాజు ప్రీతమ్, వద్దిరాజు గిరినందన్,జంగిలి రీశ్వన్త్ రెడ్డి, గంగుల సనవ్, గంగుల సౌరవ్ లు అరుణాచలేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఎంపీ రవిచంద్రను శాలువాతో సత్కరించారు.
కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని, ఆయురారోగ్యాలతో నిండూనూరేళ్లు వర్ధిల్లాలి: ఎంపీ వద్దిరాజు తెలంగాణలో వానలు విస్తారంగా కురిసి దుర్భిక్షం మటుమాయం కావాలంటూ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అరుణాచలేశ్వర స్వామి వారిని ప్రార్థించారు.వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ దుందుభి మోగించి మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావాలని, ఆయురారోగ్యాలతో నిండూనూరేళ్లు వర్ధిల్లేవిధంగా దీవెనలు అందించాలని కోరుతూ పరమశివుడిని ఎంపీ రవిచంద్ర వేడుకున్నారు.

ముదిరాజుల హక్కుల కోసం ఈ నెల 19న అమర నిరాహార దీక్ష

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 17.
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజులంతా ఒకతాటిపై వచ్చి ఒక్కడిగానే పోరాటం చేస్తారని ఆయన చెప్పారు
ఈ సందర్భంగా 33 జిల్లాలకు సంబంధించి సహాయ కోఆర్డినేటర్ నియమించినట్లు ఆయన తెలిపారు రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులంతా ఒకటి కావాల్సిన అవసరం ఉందని బిసి డి గ్రూప్ నుంచి ఏ గ్రూపులోనికి ముఖ్యమంత్రి చేర్చే విధంగా కృషి చేయాలని చెప్పారు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు జగన్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులంతా ఒక్కటై ఒక కిందికి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు 39 వర్గాలు ఏమీ లేదని అందరూ ఒకటి అవసరం ఉందని బిసి డి గ్రూప్ నుంచి ముదిరాజులను ఏ గ్రూపులోని మార్చడానికి కృషి చేయాలని ఆయన కోరారు ఈనెల 19న అమర నిరాహార దీక్ష చేస్తున్న భూమేష్ కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన చెప్పారురాజు ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ ఐక్యత కోసం అందరూ కృషి చేయాలని కోరారు శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులంతా ఒక్కటై తమ హక్కు కోసం పోరాటం చేసినప్పుడే ఫలితాలు వస్తాయని ఆయన చెప్పారు బాలరాజు ముదిరాజ్ మాట్లాడుతూ రాజకీయాల కచ్చితంగా ముదిరాజుల ఐక్యత కోసం కృషి చేయాలని కోరారు చెన్నయ్య ముదిరాజ్ మాట్లాడుతూ ఎవరు ఏ పార్టీలో ఉన్నా ముదిరాజుల ఐక్యత కోసం ఒకటి కావాల్సిన సమయం ఆసన్నమైంది అమరనిర హారదీక్షను జయప్రదం చేయాలని కోరారు ఈ సమావేశంలో జర్నలిస్టు సంఘం నేతలు పలువురు నాయకులు పాల్గొని ప్రసంగించారు

వార్తసంధ్య
www.vaarthasandhya.com

నితీశ్ కోసం తొమ్మిది హత్యలు చేశా

జేడీయూ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



పాట్నా: అక్టోబర్ 17 (వార్త సంధ్య):
బీహార్‌లో జేడీయూ ఎమ్మెల్యే అనంత్‌కుమార్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించారు. మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కోసం తొమ్మిది మంది ప్రాణాలు తీశానని ప్రకటించిన ఆయన కొద్ది సేపటికే యూటర్న్ తీసుకున్నాడు. మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై ఆ వ్యాఖ్యలు చేసినట్టు పేర్కొన్నాడు. 'నితీశ్ కోసం చేసిన తొమ్మిది హత్యల్లో నేనే సూత్రధారిగా వ్యవహరించాను' అంటూ ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని జేడీయూ పేర్కొంది. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో తన రాజకీయ విరోధి నీరజ్ కుమార్‌ను పార్టీ రంగంలోకి దింపడంతో ఆగ్రహంతో ఆయన ఈ ఆరోపణలు చేశాడు.'నితీశ్ కుమార్‌తో నాకు చాలాకాలంగా పరిచయం ఉంది. అతనికి సహాయం చేయడం కోసం నేను తొమ్మిది హత్యలకు కారణమయ్యాను. ఆయన తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి కష్టాలు పడుతున్న సమయంలో ఆయనకు సహాయంగా ఉన్నాను' అని అనంత్‌కుమార్ తెలిపారు. ' తొమ్మిది హత్యలు చేసినట్టు సింగ్ ఒప్పుకున్నాడు. అయితే తర్వాత పార్టీ ఒత్తిడో, కేంద్రం బలవంతం మీదో ఆయన తన ప్రకటనను వాపసుతీసుకోవచ్చు. అంతమాత్రాన కరుడుగట్టిన క్రిమినల్ గ్యాంగులతో అంటకాగుతూ నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా పాలన సాగించిన విషయం నిజం కాకుండా పోతుందా?' అని ఆర్జేడీ నేత శక్తి సింగ్ యాదవ్ ప్రశ్నించారు.

ఆరు నెలల్లోపు పిల్లల ఆహారంలో వీటిని కలుపొద్దు

అక్టోబర్ 17 (వార్త సంధ్య):
ఆరు నెలల్లోపు వయసున్న పిల్లలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్ , సుక్రోజ్ లను కలుపొద్దని 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ ' ప్రతిపాదించింది. ఈ మేరకు 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ఫుడ్స్ ఫర్ ఇన్‌ఫాంట్ న్యూట్రిషన్) రెగ్యులేషన్స్ యాక్ట్ 2020' కి సవరణ ముసాయిదాను ప్రచురించింది. పసితనంలోనే అదనపు చక్కెరలు తీసుకోవడాన్ని తగ్గించడం ద్వారా శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పోషకాహార భద్రతను బలోపేతం చేయడమే ఈ ప్రతిపాదనల లక్ష్యమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ తెలిపింది.బిడ్డ ఎదుగుదలకు మొదటి ఆరు నెలలు ఎంతో కీలకమని, ఈ వయసు వారికి అవసరమైన పోషకాలు అందించేలా సంబంధిత ఆహార ఉత్పత్తుల్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్‌లను కలపకుండా చూసేలా ఈ ప్రతిపాదనలను రూపొందించారని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలనే ప్రభుత్వ సిఫార్సులను ప్రోత్సహించేందుకూ ఈ చర్యలు తోడ్పడతాయని పేర్కొన్నది. బాల్యంలోనే ఊబకాయం, సంబంధిత ఆరోగ్య సవాళ్లను అరికట్టడం కూడా ఈ ప్రతిపాదనల ఉద్దేశమని వెల్లడించింది. అదేవిధంగా ముసాయిదా ప్రతిపాదనలపై 60 రోజుల్లోపు అభ్యంతరాలను, సూచనలను సమర్పించవచ్చని కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ పేర్కొన్నది.

నిరసన హక్కు నేరమైపోయింది

ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారు

కేంద్రం తీరును ఖండించిన ఎంపీ కపిల్ సిబల్

న్యూఢిల్లీ:అక్టోబర్ 17 (వార్త సంధ్య):
దేశంలో నిరసన తెలపడం నేరమైపోయిందని.. నిరసన తెలిపే ప్రజల హక్కును సుప్రీంకోర్టు రక్షిస్తుందన్న నమ్మకం తనకు ఉన్నదని రాజ్యసభ స్వతంత్ర ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలిగా కేంద్రం డీ నోటిఫై చేయడంపై ఆయన ఈ విధంగా స్పందించారు. శనివారం ఆయన ఒక ఆన్‌లైన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తీవ్ర నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, ప్రభుత్వ పెట్టుబడులు తగ్గడం వల్ల ప్రజలు కేంద్ర ప్రభుత్వంపై విశ్వాసాన్ని కోల్పోయారని.. ఈ సర్కార్ ఎంత త్వరగా అధికారం నుంచి దిగిపోతే, దేశానికి అంత మంచిదని వ్యాఖ్యానించారు. యువత చేపట్టిన నిరసనల వల్ల ప్రభుత్వానికి ఏం ప్రమాదం పొంచి ఉందని ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థలు కేంద్రీకృతం కావడం వల్ల 2024లో ఓటర్ల జాబితాను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు.

అక్కడ కూర్చొని ధర్నా చేస్తాం'..

ఢిల్లీ హైకోర్టు సమీపంలో రోడ్డు పనుల్లో జాప్యంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (వార్త సంధ్య):
దేశ రాజధానిలోని ఢిల్లీ హైకోర్టు సమీపంలో రహదారి భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో జాప్యంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద తామే స్వయంగా కూర్చొని ధర్నా చేస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. (ఔఆశ్రీశ్రీ రాత్ రాఅ ఐష్ఘుతీఆు) ఢిల్లీ హైకోర్టు సమీపంలోని మధుర రోడ్డు కూడలి వద్ద రహదారి భద్రత, సరైన ట్రాఫిక్ నిర్వహణ లేకపోవడం, పాదచారుల భద్రతా పరమైన సమస్యలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది.కాగా, ఒక కమిటీ ఈ సమస్యను పరిశీలిస్తున్నదని, ఉన్నతాధికారులతో తాను చర్చించానని కేంద్ర ప్రభుత్వం తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే ఉన్నత స్థాయి కమిటీ అవసరమేమిటని కోర్టు ప్రశ్నించింది. సమస్యను ఖచ్చితంగా గుర్తించి, పరిష్కారాన్ని కనుగొనేందుకు 'అమికస్ క్యూరీ' (కోర్టుకు సహాయం చేసే వ్యక్తి)ని భాగస్వామిగా చేయాలని సూచించింది. అధికారులు కమిటీ చర్చలకే పరిమితం కాకుండా, తదుపరి విచారణకు ముందే అవసరమైన క్షేత్రస్థాయి పనులను పూర్తి చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. మరోవైపు గడువులోగా అధికారులు స్పష్టమైన పరిష్కారాన్ని అమలు చేయడంలో విఫలమైతే, ఏఎస్‌జీతో పాటు ప్రధాన కార్యదర్శి కూడా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. నవంబర్ 25లోపు తగిన చర్యలు చేపట్టకపోతే, తామే స్వయంగా హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద 'ధర్నా' చేస్తామని పేర్కొంది. 'ఒకవేళ మీరు ఈ పని పూర్తి చేయకపోతే, మేమిద్దరం (సుప్రీంకోర్టు ధర్మాసనంలోని న్యాయమూర్తులు) ఢిల్లీ హైకోర్టు ప్రధాన ద్వారం వద్ద కూర్చుంటాం. పని పూర్తయ్యే వరకు అక్కడి నుంచి మేం కదలబోము, ఇంటికి కూడా వెళ్లము. ఇది ఖాయం. మిమ్మల్ని కూడా ఇంటికి వెళ్లనివ్వం' అని ధర్మాసనం సరదాగా వ్యాఖ్యానించింది. ఢిల్లీలో ప్రస్తుతం వివిధ అంశాలపై అనేక నిరసనలు జరుగుతున్న తరుణంలో, సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యత సంతరించుకున్నది.

భారత్‌పై 100 శాతం సుంకాలు నిలిపివేసిన ట్రంప్

వాషింగ్టన్, అక్టోబర్ 17 (వార్త సంధ్య):
రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై 100 శాతం సుంకాలను విధించేందుకు వీలు కల్పించే చట్టాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికా ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపారు. సుంకాలు విధించే ఈ బిల్లుకు సెప్టెంబర్ 18న ట్రంప్ ఆమోదం తెలిపి, సంతకం చేసినప్పటికీ సుంకాలు స్వయంచాలకంగా అమలులోకి రాలేదు. ఈ చట్టం అమలుకు ముందు 12 నెలల కాలంలో రష్యా నుంచి అత్యధిక మొత్తంలో ముడిచమురు, న్యాచురల్ గ్యాస్‌ను దిగుమతి చేసుకునే ఐదు దేశాలు చట్టం అమలులోకి వచ్చిన 30 రోజుల తర్వాత కూడా వాటిని దిగుమతి చేసుకుంటే 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రతిపాదించారు.

రాంలీలా మైదానంలో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ర్యాలీ..

-అనుమతించిన పోలీసులు

న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (వార్త సంధ్య):
ఢిల్లీలోని ప్రతిష్టాత్మక రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ చేపట్టనుంది. నవంబర్ 1న ర్యాలీ నిర్వహించనుంది. ఇందుకోసం ఢిల్లీ పోలీసులు కాంగ్రెస్ పార్టీకి అనుమతిపత్రం మంజూరు చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు, సర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ కూటమి ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో కూడా ఆందోళనల సరళిపై నిర్ణయం తీసుకున్నారు.దీనిలో భాగంగా ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. ఇదే సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికను ఆందోళనల చేసే ప్రదేశాల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. దీంతో రాంలీలా మైదానంలో ర్యాలీ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందుకోసం అనుమతి కోరుతూ ఢిల్లీ పోలీసులను కాంగ్రెస్ పార్టీ ఆశ్రయించింది. వారి వినతిని పరిశీలించిన పోలీసులు.. నవంబర్ 1న ర్యాలీ నిర్వహించుకునేందుకు అనుమతించారు. శనివారం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు ఏ రోజైనా ర్యాలీ నిర్వహించుకోవచ్చని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. దీంతో నవంబర్ 1న ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ ర్యాలీ కోసం ఢిల్లీ పోలీసులు నిర్వాహకులతోపాటు ట్రాఫిక్ పోలీసులు, ఇతర వ్యవస్థలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ట్రాఫిక్ మళ్లించాల్సి ఉంటుంది. శాంతి భద్రతలను కాపాడాలి. ఈ నేపథ్యంలో అన్నీ పరిశీలించిన పోలీసులు.. నిబంధనలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీకి అనుమతించారు. సేవ్ డెమొక్రసీ పేరుతో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ చేపట్టే అవకాశం ఉంది. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రమే పాల్గొంటారా.. లేక ఇండియా బ్లాక్ కూటమి నేతలంతా పాల్గొంటారా అనే అంశంలో స్పష్టత రావాల్సి ఉంది.

కాలువలో పడ్డ టెంపో ట్రావెలర్

రాజస్థాన్‌లో 8 మంది మృతి

భోపాల్:అక్టోబర్ 17 (వార్త సంధ్య):
మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాకు చెందిన 8 మంది రాజస్థాన్‌లోని కోటా జిల్లాలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై ప్రయాణిస్తున్న టెంపో ట్రావెలర్ రోడ్డు నుంచి పక్కకు జరిగి కాలువలోకి పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో 15 మంది గాయపడ్డారు. ఎమర్జెన్సీ సిబ్బంది క్రేన్ల సాయంతో బాధితులను బయటకు తీశారు. బాధితులు శిఖర్ జిల్లాలోని ఖటు శ్యామ్ మందిరాన్ని దర్శించుకొనేందుకు వెళుతున్నట్టు తెలిసింది. డ్రైవర్ కునుకు తీయ డం వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని గాయపడిన అన్షిక తెలిపారు.

భారతీయులకు ట్రంప్ మరో షాక్

-వర్క్ పర్మిట్ పొడిగింపు రద్దు

న్యూయార్క్ అక్టోబర్ 17 (వార్త సంధ్య):
భారతీయులతో పాటు ప్రపంచ దేశాలకు చెందిన లక్షలాది మందికి అమెరికా మరో షాక్ ఇచ్చింది. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న సమయంలో ఉద్యోగం కోల్పోకుండా రక్షణ కల్పిస్తున్న 540 రోజుల ఆటోమేటిక్ వర్క్ పర్మిట్ పొడిగింపు రూల్‌ను రద్దు చేస్తున్నట్టు యూఎస్ సిటిజెన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. దీంతో హెచ్–4 వీసా కలిగిన జీవిత భాగస్వాములు, హెచ్–1బీ వీసా కలిగిన భారతీయుల భాగస్వాములు ఇబ్బంది పడతారు. వర్క్ పర్మిట్ రద్దు అయితే వారు ఉద్యోగం చేయడానికి వీలుండదు. గతేడాది అక్టోబర్ 30 తర్వాత రెన్యువల్ దరఖాస్తులు సమర్పించిన వారికి ఈ కొత్త నిబంధనలు వర్తిస్తాయి. అయితే ఎఫ్–1 స్టెమ్ విద్యార్థులకు మాత్రం 180 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు కొనసాగుతుందని యూఎస్ స్పష్టం చేసింది.

ఐదుగురి ప్రాణం తీసిన నూడుల్స్, టీ!

ముంబై :అక్టోబర్ 17 (వార్త సంధ్య):
గ్రేటర్ నోయిడాలో ఘోర విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతున్నది. రబూపురా ప్రాంతం నగ్లా శ్రీ పదమ్ గ్రామానికి చెందిన మహేశ్ (37), ఆయన భార్య లలిత (35), వారి పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షత్ (3) శనివారం ఉదయం మృతిచెందారు. పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. రాత్రి భోజనంలో ఐదుగురూ నూడుల్స్ తిని తర్వాత టీ తాగారని మహేశ్ తల్లి చెప్పారు. రెండూ కలిపి తీసుకోవడం వల్లే ఫుడ్ పాయిజన్ అయ్యి చనిపోయారేమో అని పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు పంపించారు. పరీక్షల నివేదికల్లో అసలు కారణాలు ఏంటనేది తెలుస్తుంది.

అద్వానీకి ఛాతీలో ఇన్ఫెక్షన్ దవాఖానలో చేరిక

న్యూఢిల్లీ: అక్టోబర్ 17 (వార్త సంధ్య):
బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ(98) ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో దవాఖానలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ఆయనకు అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నట్టు, ఆయన ఆరోగ్యాన్ని ఒక వైద్యుల బృందం పర్యవేక్షిస్తున్నట్టు దవాఖాన అధికారులు తెలిపారు. వృద్ధాప్య సంబంధిత ఆరోగ్య సమస్యల కారణంగా ఈ సంవత్సరం మే నెలలో అద్వానీ ఇదే దవాఖానలో చికిత్స పొందారు. డిసెంబర్ 2024లోనూ ఆయన కొన్ని రోజులు ఐసీయూలో ఉన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల..

జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!

నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్'. సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'అప్పుడే పెళ్లా' లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది.టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. "ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

బాలీవుడ్‌లో మరో బంపరాఫర్

దక్షిణాది యువతరంలో మంచి క్రేజ్ సంపాదించుకున్న అచ్చ తెలుగందం శ్రీలీల ఇప్పుడు హిందీలో కూడా వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటున్నది. ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్‌బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ మ్యూజికల్ డ్రామాలో శ్రీలీల నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో బంపరాఫర్‌ను దక్కించుకుంది.సిద్ధార్థ్ గుప్తా ప్రధాన పాత్రలో రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రం తెరకెక్కుతున్నది. దీనికి ఉమేశ్ బిష్ట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీకపూర్, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో ప్రారంభమైంది. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని సమాచారం. బాలాజీ మోషన్ పిక్చర్స్ పతాకంపై ఏక్తా కపూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలీవుడ్‌లో తొలి చిత్రం రిలీజ్ కాకముందే మరో భారీ ఆఫర్‌తో శ్రీలీల అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది.

ఆఫర్స్ వస్తున్నా.. కావాలనే 'నో' చెబుతున్నా..

సీతారామం, హాయ్ నాన్న లాంటి సూపర్ హిట్లతో జోరుమీదున్న మృణాల్ ఠాకూర్, బ్రేక్ తీసుకున్నారు. ఇండస్ట్రీలో వరుస ఆఫర్లు వస్తున్నా ఆమె కొత్త ప్రాజెక్టులకు సైన్ చేయకపోవడంపై క్లారిటీ ఇచ్చారు. ఇంతకీ మృణాల్ తీసుకున్న నిర్ణయమేంటి..? హావ్ ఏ లుక్. సీతారామం సినిమాతో ఓవర్‌నైట్‌లో స్టార్‌గా మారిన మృణాల్ ఠాకూర్ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ లాంటి సినిమాలతో బిజీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నారు. రీసెంట్ గా అడివి శేష్ తో డెకాయిట్ సినిమాలోనూ నటించారు. డెకాయిట్ రిలీజ్ తరువాత కొత్త సినిమాకు సైన్ చేయలేదు ఈ బ్యూటీ. తాజాగా తన కొత్త ప్రాజెక్టులపై వస్తున్న కామెంట్స్ మీద స్పందించిన మృణాల్ ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. పేరు కోసమో, నెంబర్ కోసమో హడావుడిగా సినిమాలు చేయడం తనకు ఇష్టం లేదన్నారు. తాను నటించే ప్రతి సినిమా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉండాలిని, అదే టైమ్‌లో తనకు కూడా నటిగా శాటిస్ఫాక్షన్ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం తన వద్దకు వస్తున్న కథలు తనకు అంతగా కనెక్ట్ కాకపోవడం వలనే కొత్త చిత్రాలకు సైన్ చేయలేదన్నారు. ఒక సినిమా కోసం సెట్స్‌లో సుదీర్ఘ కాలం గడపాల్సి ఉంటుందని, అలాంటప్పుడు పూర్తి డెడికేషన్‌తో పనిచేసేందుకు బలమైన కథాంశాలు అవసరమన్నారు. నెంబర్ గేమ్ కోసం సినిమాలు చేయనని క్వాలిటీనే ఫస్ట్ ప్రియారిటీ అని కుండబద్దలు కొట్టేశారు. భవిష్యత్తులో కూడా కేవలం తన నటనకు స్కోప్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటానని క్లారిటీ ఇచ్చారు మృణాల్. తన నెక్స్ట్ సినిమాలకు సంబంధించిన ఎలాంటి అప్‌డేట్ ఉన్నా తానే అధికారికంగా వెల్లడిస్తానని, రూమర్స్‌ను నమ్మవద్దని కోరారు.

దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్!

యువ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్/డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' . పవన్ సాధినేని దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. చదువంటే ఇష్టమున్న ఒక అమ్మాయి పల్లెటూరి నేల నుంచి మొదలై ఏకంగా అంతరిక్షం వరకు సాగే ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రయాణంగా ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక నటిస్తుండగా, శృతి హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన విజువల్స్ తో రూపొందుతున్న ఈ టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

కత్తి పట్టిన సీతగా సాయి పల్లవి..

అదరగొడుతున్న 'రామాయణం' కొత్త ప్రోమో!

నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్-ఇండియా చిత్రం 'రామాయణం' తాలూకు కొత్త ప్రోమో ప్రస్తుతం సినిమా వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో సీతాదేవిగా నటిస్తున్న సాయి పల్లవి చేతిలో కత్తితో యోధురాలి రూపంలో కనిపించిన విజువల్స్ అందరినీ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా సినిమాలలో సీతాదేవి పాత్రను కేవలం బాధ్యతాయుతమైన భార్యగా మాత్రమే చూపించడం ఆనవాయితీగా వస్తుండగా, ఈ చిత్రంలో ఆమెలోని ధైర్యసాహసాలు, యోధురాలి కోణాన్ని ఆవిష్కరించేలా మేకర్స్ ఈ ప్రోమోను రూపొందించారు.ఈ విజువల్ వండర్ సినిమాకు సంబంధించిన ఈ కొత్త ప్రోమో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. రణబీర్ కపూర్ రాముడిగా, యష్ రావణాసురుడిగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం అందిస్తున్నారు. నవంబర్ 5న దీపావళి కానుకగా ఈ చిత్ర మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

డేంజర్ జోన్‌లో మిల్కీ బ్యూటీ కెరీర్..

-అది తప్ప మరో ఆప్షన్ కనిపించట్లేదా..?

తన కెరీర్‌ను కాపాడుకోవాలంటే బోల్డ్ స్టెప్ తీసుకోక తప్పదని మిల్కీ బ్యూటీ తమన్నా గట్టిగా డిసైడ్ అయిపోయారా..? అందుకే తన 18 ఏళ్ళ ప్రయాణంలో ఎన్నడూ లేనంతగా వరుసపెట్టి బోల్డ్ సినిమాలను ఓకే చేస్తున్నారా..? రాగిణి ఎంఎంఎస్ 3 సినిమానే ఎక్స్‌ట్రీమ్ అనుకుంటే.. దాన్ని మించిన మరో డర్టీ పిక్చర్‌లో తమన్నా నటించబోతున్నారా..? అసలు మిల్కీ బ్యూటీ ప్లాన్ ఏంటి..? ఇండస్ట్రీకి వచ్చాక దాదాపు 18 ఏళ్ళ పాటు నో కిస్సింగ్ పాలసీ ఫాలో అయ్యారు తమన్నా. కానీ తన రూట్ పూర్తిగా మార్చేశారిప్పుడు. ఆ మధ్య వచ్చిన లస్ట్ స్టోరీస్ 2 వెబ్ సిరీస్‌లో పాత రూల్స్ అన్నీ పక్కనపెట్టి లిప్‌లాక్ సీన్స్‌తో పాటు ఇంటిమేట్ సీన్స్‌లో నటించి అందరికీ షాక్ ఇచ్చారు. అదే బాటలో వెళ్తూ రాగిణి ఎంఎంఎస్ 3 లాంటి పక్కా బోల్డ్ అండ్ హారర్ సినిమాలో నటిస్తున్నారు. రాగిణి ఎంఎంఎస్ ఫ్రాంచైజీలోనే ఇంటిమేట్ సీన్స్‌కు ఏమాత్రం కొదవ ఉండదు.. పార్ట్ 3లోనూ తమన్నా గ్లామరస్‌గా కనిపించబోతున్నారని తెలుస్తుంది. ఇది సెట్స్‌పై ఉండగానే ది డర్టీ పిక్చర్ 2లోనూ హీరోయిన్‌గా తమన్నాని తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశేషం ఏంటంటే ఈ రెండు బోల్డ్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నది ఏక్తా కపూరే. మొత్తానికి కెరీర్‌లో ఖాళీ అనే పదమే లేకుండా ఎలాగోలా బిజీగా ఉండటమే లక్ష్యంగా మిల్కీ బ్యూటీ అడుగులేస్తున్నారు. కుదిరితే హీరోయిన్ ఆఫర్స్, లేదంటే క్రేజీ స్పెషల్ సాంగ్స్, అదీ కాకపోతే ఓటీటీ వెబ్ సిరీస్‌లు, ఇవేవీ కాదంటే ఇలాంటి బోల్డ్ సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నారు. ఏదేమైనా 35 దాటాక తమన్నా గేర్ మార్చి వరుస ఆఫర్లతో ఇండస్ట్రీని షేక్ చేస్తుండటం విశేషం.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.